- aruhi group
www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

సోమవారం
30-03-2026


సంపుటి : 01 సంచిక : 8 పేజీలు : 08 వెల : ₹5/- తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.

Published From RANGAREDDY తెలంగాణ. RNI NO : TGTEL/26/A0738 VOLUME : 01 ISSUE : 8 NAMASTEY MAHAAPRABHA



Mr. NAKKA RAJU
Chairman of Namastey Mahaaprabha

## బెంగాల్‌లో ఫిష్ పాలిటిక్స్..



- బీజేపీ అధికారంలోకి వస్తే నాన్ వెజ్ తిననీయరన్న దీదీ..
- చేపలతో బీజేపీ నేతల ప్రచారం

న్యూఢిల్లీ-మార్చి 29 (మహాప్రభ):
పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో అధికార తృణముల్ కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ మధ్య తీవ్ర మధ్య తీవ్ర మాటల యుద్ధం నెలకొంది. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే మాంసాహారంపై నిషేధం విధిస్తారని.. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సహా టీఎంసీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇప్పుడు ఫిష్ పాలిటిక్స్ ఆ రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బెంగాల్‌లో బీజేపీ గెలిస్తే.. చేపలు, గుడ్లను తినకూడని -మిగతా 3 లో

## ఏప్రిల్ రెండో వారంలో ఇంటర్ ఫలితాలు

- ముగిసిన జవాబుపత్రాల మూల్యాంకనం
- ఏప్రిల్ 8,10,12 తేదీల్లో ఏదో ఒక రోజు ఫలితాలు విడుదల




హైదరాబాద్, -మార్చి 29 (మహాప్రభ):
ఇంటర్ వార్షిక పరీక్షల ఫలితాలు ఏప్రిల్ రెండో వారంలో విడుదలకానున్నాయి. ఏప్రిల్ 8,10,12 తేదీల్లో ఏదో ఒక రోజు ఫలితాలు విడుదల చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఆయా తేదీల్లో ఫలితాల వెల్లడికి ప్రభుత్వ అనుమతి కోరారు. ఇంటర్ జవాబుపత్రాల మూల్యాంకనం ఆదివారంతో ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా -మిగతా 3 లో



## ఇరాన్‌కు షాక్..

- ఖర్గ్ ఐలాండ్‌ను స్వాధీనం చేసుకున్న అమెరికా
- ఇరాన్ ముడి చమురు ఎగుమతుల్లో దాదాపు 90 శాతం ఈ దీవి నుంచే
- ఈ మెరుపుదాడితో ఇరాన్ ఆర్థిక మూలాలను అమెరికా గట్టిగా దెబ్బ

న్యూఢిల్లీ మార్చి 29 (మహాప్రభ):
పశ్చిమాసియ లో యుద్ధ మేఘాలు మరింత దట్టంగా కమ్ముకుంటున్నాయి. ఇరాన్ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేలా అమెరికా సంచలన చర్యకు దిగింది. ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన హర్మూజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ 'ఖర్గ్ ఐలాండ్' ను అమెరికా దళాలు తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. ఇరాన్ ముడి చమురు ఎగుమతుల్లో దాదాపు 90 శాతం ఈ దీవి నుంచే జరుగుతాయి. ఈ మెరుపుదాడితో ఇరాన్ ఆర్థిక మూలాలను అమెరికా గట్టిగా దెబ్బతీసినట్లయింది. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.అమెరికా వైమానిక, నౌకాదళాలు సంయుక్తంగా ఈ ఆపరేషన్‌ను పూర్తిచేసినట్లు సమాచారం. అంతేకాకుండా త్వరలో ఇరాన్ భూభాగంలోకి సైన్యాన్ని పంపేందుకు ట్రంప్ యంత్రాంగం సిద్ధమవుతోంది. ఇందుకోసం ఇప్పటికే పశ్చిమాసియాకు అదనపు బలగాలను తరలిస్తున్నట్లు నివేదికలు వస్తున్నాయి. అమెరికా నేరుగా ఇరాన్ గడ్డపైకి సైన్యాన్ని పంపాలని నిర్ణయించడం అంతర్జాతీయంగా కలకలం రేపుతోంది. గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలు, చమురు క్షేత్రాలపై ఇరాన్ అనుకూల వర్గాలు చేసిన దాడులకు ప్రతిగా అమెరికా ఈ కఠిన నిర్ణయం తీసుకుంది.మరోవైపు హర్మూజ్ జలసంధిని మూసివేస్తామని ఇరాన్ హెచ్చరించడంతో ఆ మార్గాన్ని తమ నియంత్రణలో ఉంచుకునేందుకు అమెరికా దళాలు భీకరంగా పోరాడుతున్నాయి. ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ సంస్థలు శాంతి చర్చల కోసం ప్రయత్నిస్తున్నప్పటికీ పరిస్థితులు పూర్తిస్థాయి యుద్ధానికి దారితీసేలా కనిపిస్తున్నాయి. ఒకవేళ హర్మూజ్ జలసంధి -మిగతా 3 లో

## దళితులు పరిపాలన చేయొద్దా?

### వారి పట్ల ఇదేనా మీ వైఖరి

- అప్పుడు ఎస్సీని సీఎం చేస్తామన్నారు..మాట తప్పారు
- ఇప్పుడేమో దళితుడు స్పీకర్‌గా ఉన్నారు కాబట్టి సభకు రావటం లేదు : అసెంబ్లీలో బీఆర్ఎస్‌పై నిప్పులు చెరిగిన సీఎం రేవంత్‌రెడ్డి
- గులాబీ పార్టీ మంత్రాలకు చింతకాయలు రాలవంటూ ఎద్దేవా
- పొంగులేటి రాజీనామా కుదరదంటూ వ్యాఖ్య
- ఇక్కడ ఉన్నది రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క అంటూ హెచ్చరిక



హైదరాబాద్ మార్చి 29 (మహాప్రభ):
'దళితులు పరిపాలనలో భాగస్వాములు కాకూడదా? వారు పెద్ద పదవులు చేపట్టొద్దా? ఇదేనా వారి పట్ల మీ పార్టీ వైఖరి...' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధిస్తే దళితుడినే మొట్టమొదటి సీఎం చేస్తానని చెప్పిన ఆ పార్టీ అధినేత కేసీఆర్... ఇచ్చిన మాట తప్పారని ఎద్దేవా చేశారు. ఆనాడు అలా వ్యవహరించిన ఆయన... ఇప్పుడు శాసనసభ స్పీకర్‌గా దళితుడైన గడ్డం ప్రసాద్ కుమార్ ఉన్నారు కాబట్టే... అసెంబ్లీకి రావటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఆదివారం సభలో బిల్లులపై చర్చ సందర్భంగా... -మిగతా 3 లో



## అదరగొట్టిన రోహిత్, రికెల్టన్..

- కెకెఆర్‌పై ముంబయి ఇండియన్స్ 6 వికెట్ల తేడాతో ఘన విజయం
- ముంబై.. 13 ఏళ్ల తర్వాత ఆరంభ మ్యాచ్‌లో గెలుపు

ముంబయి-మార్చి 29 (మహాప్రభ):
ఐపిఎల్ 2026లో భాగంగా కెకెఆర్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ముంబయి లోని వాంఖడే స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన కెకెఆర్ నిర్ణీత 20 ఓవర్లలో 4 -మిగతా 3 లో




## అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్

- పాడి కౌశిక్‌రెడ్డిపై ఎథిక్స్ కమిటీకి సిఫారసు

హైదరాబాద్ మార్చి 29 (మహాప్రభ):
రాష్ట్ర శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సస్పెండ్ చేశారు. సభా కార్యక్రమాలను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అడ్డుకుంటున్నారనీ, వారిని సస్పెండ్ చేయాలని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తీర్మానం ప్రవేశపెట్టారు. దీంతో కేటీఆర్, హరీశ్‌రావు సహా ఆపార్టీ ఎమ్మెల్యేలను రెండురోజులపాటు సస్పెండ్ చేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. సస్పెన్షన్‌కు గురైన వారిలో తలసాని శ్రీనివాస్‌యావ్, గుంతకండ్ల జగదీష్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, గంగుల కమలాకర్, మాధవరం కృష్ణారావు, -మిగతా 3 లో

## టార్గెట్ అమెరికా!

- యూఎస్‌ను లక్ష్యంగా చేసుకునే క్షిపణికి ఇంజిన్ పరీక్ష
- కిమ్ పర్యవేక్షణలో నిర్వహించిన ఉత్తర కొరియా



సియోల్ మార్చి 29 (మహాప్రభ):
మధ్యప్రాచ్యంలో ఉద్రిక్త పరిస్థితుల నడుమ నార్త్ కొరియా కీలక పరీక్షలు జరుపుతోంది. అమెరికా ప్రధాన భూభాగాన్ని లక్ష్యంగా చేసుకోగల సామర్థ్యం ఉన్న క్షిపణికి ఇంజిన్ టెస్ట్‌ను జరిపింది. ఉత్తర కొరియా నేత కిమ్ జోంగ్ ఉన్ పర్యవేక్షణలో అధిక శక్తి కలిగిన సాలిడ్-ఫ్యూయల్ ఇంజిన్ పరీక్ష జరిగింది. ఇది నార్త్ కొరియా వ్యూహాత్మక సైనిక సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఒక ముఖ్యమైన ముందడుగు అని ఆ దేశ అధికారిక వార్తా సంస్థ కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ (కేసీఎన్ఏ) తెలిపింది. అమెరికా ప్రధాన భూభాగాన్ని చేరుకోగల క్షిపణుల ఆయుధాగారాన్ని విస్తరించడం, ఆధునీకరించడంపై కిమ్ దృఢసంకల్పంతో ఉన్నారని ఈ పరీక్ష సూచిస్తోందని విశ్లేషకులు చెప్తున్నారు. ఈ వార్తా సంస్థ వెల్లడించిన -మిగతా 3 లో

## పొంగులేటీపై బీఆర్ఎస్ ఫైట్

### మంత్రి అక్రమాలపై రోజంతా అట్టుడికిన అసెంబ్లీ

- హౌస్ కమిటీకి పట్టు.. బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్
- సభను కుదిపేసిన పొంగులేటి సంస్థ అక్రమాలు
- స్పీకర్ పోడియం వద్దకు వెళ్లి సభ్యుల నినాదాలు
- నిరసన వేళ పెద్దఎత్తున మార్షల్స్ మోహరింపు
- అవినీతిపై సమాధానం చెప్పలేక అడ్డదారులు
- కౌశిక్ అంశంతో తప్పుదోవ పట్టించే యత్నం
- పట్టువీడని బీఆర్ఎస్.. 4 గంటలపాటు నిరసన
- చివరికి బీఆర్ఎస్ శాసనసభ్యుల సస్పెన్షన్
- ఈ సెషన్ ముగిసేవరకూ వర్తిస్తుందన్న స్పీకర్

విచారణ జరుపాలంటూ బీఆర్ఎస్ ఆందోళన




హైదరాబాద్, మార్చి 29 (మహాప్రభ):
బీఆర్ఎస్ సభ్యుల నిరసనలు, ఆందోళనలతో ఆదివారం అసెంబ్లీ అట్టుడికింది. 'పొంగులేటి కాదు.. పొంగు'లూటీ'.. 'మంత్రుల అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి'.. 'రక్షకుడే భక్షకుడైతే ప్రజలకు దిక్కెవరు?'.. 'అక్రమాల ఘనాపాటి మంత్రి పొంగులేటి'.. అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ బీఆర్ఎస్ సభ్యులు చేసిన నినాదాలతో సభ దద్దరిల్లింది. 'తల్లిదండ్రుల సంరక్షణ ఉద్యోగుల బాధ్యత' అన్న బిల్లుపై ఆదివారం -మిగతా 3 లో

## గల్ఫ్ నుంచి భారత తీరంవైపు రెండు ఎల్పీజీ నౌకలు



3 లో



## కష్టకాలంలో అండగా నిలిచారు'..

- గల్ఫ్ దేశాలు చూపిన చొరవ మరువలేనిది
- గల్ఫ్ దేశాల ప్రజలకు ప్రధాని మోదీ కృతజ్ఞతలు

న్యూఢిల్లీ మార్చి 29 (మహాప్రభ):
పశ్చిమాసియా లో నెలకొన్న యుద్ధ వాతావరణంలో చిక్కుకుపోయిన భారతీయ పౌరులను సురక్షితంగా స్వదేశానికి తరలించడంలో సహాయం అందించిన గల్ఫ్ దేశాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధన్యవాదాలు తెలిపారు. కష్టకాలంలో భారతీయులకు అండగా నిలిచిన యూఏఈ సౌదీ అరేబియా ఖతార్, ఒమన్ -మిగతా 3 లో

## ఎర్రగా మారిన ఆకాశం.. ఆస్ట్రేలియాలో అరుదైన ఘటన




**న్యూఢిల్లీ మార్చి 29 (మహాప్రభ):**
ఆస్ట్రేలియాలో అరుదైన ప్రకృతి దృశ్యం ఆవిష్కృతమైంది. కాకపోతే, ఇది చాలామందిని భయపెట్టింది కూడా. పశ్చిమ ఆస్ట్రేలియాలోని కొన్ని ప్రాంతాలు పూర్తిగా ఎరుపు రంగులోకి మారిపోయాయి. అది కూడా బ్లడ్ రెడ్ కలర్. అచ్చం రక్తంలాగే ఎరుపు రంగులోకి వాతావరణం మారిపోవడంతో స్థానికులకు వింత అనుభవం ఎదురైంది. ఈ ఘటన శుక్రవారం ఆస్ట్రేలియాలోని డెన్‌హామ్ అనే టూరిస్ట్ పట్టణంతోపాటు షార్క్ బే, పిల్బారా ప్రాంతాల్లో జరిగింది. ఆకాశం పూర్తిగా రక్తపు ఎరుగు రంగులోకి మారిపోవడంతో ప్రతి దృశ్యం ఎర్రగానే కనిపించింది. నారెల్లె అనే ఉష్ణమండల సైక్లోన్ ప్రభావంతో ఇలా జరిగిందని వాతావరణ శాస్త్రవేత్తలు అంటున్నారు. ఇది తీర ప్రాంతం. తీరాన్ని నారెల్లె తుఫాన్ సమీపించిన సమయంలో గాలి ప్రభావానికి ఐరన్ కలిసిన దుమ్ము అంతటా వ్యాపించడం, మబ్బుల్ని కమ్ముకోవడం వల్ల, సూర్యకాంతి ప్రభావంతో అంతా ఎర్రగా మారింది. కాంతి వికిరణ చర్య ద్వారా ఇలా జరుగుతుందని నిపుణులు అంటున్నారు. ఈ కాంతిని నేరుగా చూసిన అక్కడి ప్రజలు ఆశ్చర్యానికి లోనయ్యారు. కొందరు ఆనందం వ్యక్తం చేస్తే, మరికొందరు భయందోళనకు గురయ్యారు. ఎప్పుడో కానీ, ఇలాంటి దృశ్యాన్ని తాము చూడలేమని చాలా మంది అన్నారు. భూమిపై కాకుండా ఏదో కొత్త లోకంలో ఉన్నట్లు అనిపించిందని అక్కడి వారు తెలిపారు. ఈ అరుదైన దృశ్యాన్ని తమ ఫోన్ కెమెరాల్లో బంధించి, సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్‌గా మారాయి.

## మేమే ఉగ్రవాదులం

-- అమెరికా ఉగ్రవాద నిరోధక అధికారి

**వాషింగ్టన్ మార్చి 29 (మహాప్రభ):**
ఇరాన్‌లోని మినాబ్‌లో బాలికల పాఠశాలపై క్షిపణి దాడి ప్రపంచ మనస్సాక్షిని దిగ్భ్రాంతికి గురి చేసిందని అమెరికా సైనిక మాజీ నిఘా, ఉగ్రవాద నిరోధక అధికారి జోసెఫిన్ గిల్బో తెలిపారు. అమెరికా పకడ్బందీగా ప్రణాళిక చేసి, ఉద్దేశపూర్వకంగా అమలు చేసిందన్నారు. 165 మంది బాలికలను బలిగొన్న ఈ దాడి ప్రమాదవశాత్తు జరగలేదని, పథకం ప్రకారం జరిపిన బాంబు దాడి అన్నారు. మనమే (అమెరికా) ప్రపంచంలోనే అతిపెద్ద ఉగ్రవాదులం. ప్రతినాయకులం" అని ఆమె వివరించారు.



## పెళ్లి భోజనంలో లెగ్ పీసులు రాలేదని రచ్చ



**లక్నో మార్చి 29 (మహాప్రభ):**
తమకు చికెన్ లెగ్ పీసులు అందలేదనే ఆరోపణలతో ఒక పెళ్లి రిసెప్షన్ సందర్భంగా పెళ్లి వేదిక వద్ద గ్యాంగ్ ఫైట్ జరిగింది. ఈ విషాద సంఘటన ఉత్తరప్రదేశ్‌లోని అమ్రోహాలో చోటుచేసుకుంది. పెళ్లికొడుకు కుటుంబం ఈ గొడవను ప్రారంభించింది. ఈ గొడవకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అవుతోంది. కొంతమంది టేబుల్ పైకి ఎక్కి పెద్ద బిర్యానీ గిన్నెల నుండి తమకు ఇష్టమైన ముక్కలను తింటూ కూడా వీడియోలో కనిపిస్తున్నారు. పెళ్లి రిసెప్షన్‌లో వడ్డించిన బిర్యానీలో చికెన్ లెగ్ పీసులు అందలేదని ఆరోపిస్తూ పెళ్లికొడుకు కుటుంబం గొడవ సృష్టించింది. పరిస్థితి విషమించడం చూసి, పెళ్లికూతురి కుటుంబం కూడా జోక్యం చేసుకుంది. దీంతో మాటల యుద్ధం పిడిగుద్దుల పోరాటానికి దారితీసింది. పెళ్లికొడుకుతో వచ్చిన వారు పెళ్లి రిసెప్షన్‌లోని కుర్చీలను, టేబుళ్లను ధ్వంసం చేశారు. చివరకు పోలీసులు వచ్చి పరిస్థితిని చక్కదిద్దారు.

## మంగోలియా ప్రధానమంత్రిగా న్యామ్-ఓసోర్

**ఉలాన్‌బాతర్ మార్చి 29 (మహాప్రభ):**
అధికార మంగోలియన్ పీపుల్స్ పార్టీ ప్రస్తుత ఛైర్మన్ మరియు పార్లమెంట్ స్పీకర్ అయిన ఉక్రాల్ న్యామ్-ఓసోర్ మంగోలియా కొత్త ప్రధానమంత్రిగా నామినేట్ అయ్యారు. ప్రభుత్వ వార్తా సంస్థ మాంట్‌సెమ్ నివేదిక ప్రకారం, ఎంపీపీ సమావేశంలో ఏకగ్రీవంగా న్యామ్-ఓసోర్‌ను అభ్యర్థిగా ఎన్నుకున్నారు. గోంబోజావ్ సంతన్‌షట్టార్ రాజీనామాతో ఏర్పడిన ఖాళీని ఆయన భర్తీ చేస్తారు. కొత్త ప్రధానమంత్రి నాలుగు నెలల్లో పదవీ బాధ్యతలు స్వీకరిస్తారు.



# సూళ్లూరుపేటలో ఘనంగా తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం

-ఉత్సాహంగా పాల్గొన్న తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు

**మార్చ్ 29 తిరుపతి జిల్లా (సూళ్లూరుపేట) మహాప్రభ**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నత కోసం నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించి నేటికి 44 సంవత్సరాలు పూర్తవుతుందని స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలియజేశారు. సూళ్లూరుపేట లోని శేష సాయి కళ్యాణ మండపము నందు జరిగిన తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం లో సూళ్లూరుపేట నియోజకవర్గ పరిశీలకులు శివప్రసాద్, ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగా ప్రసాద్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వేనాటి సతీష్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మొదటగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నందమూరి తారక రామారావు పార్టీ స్థాపించినప్పుడు నుండి ఇప్పటివరకు పార్టీకి వెన్నుదన్నుల కార్యకర్తలే అండగా ఉన్నారని, నందమూరి తారక రామారావు ఆశయాలు, సిద్ధాంతాల కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్టీ పగ్గాలు చేపట్టినప్పటి నుండి అలుపెరగని కృషితో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని తెలిపారు. కొండేపాటి గంగా ప్రసాద్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే నిజమైన బలమని తెలిపారు. వేనాటి సతీష్ రెడ్డి మాట్లాడుతూ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించినప్పటి నుండి ఇప్పటివరకు పార్టీ సంస్థాగత నిర్మాణానికి సూళ్లూరుపేట నియోజకవర్గంలో వేనాటి వంశస్తులు పార్టీకి చేసిన సేవ ఎంతో గుర్తించదగ్గదని తెలిపారు. ప్రతి ఒక్క తెలుగుదేశం పార్టీ కార్యకర్త పార్టీ కోసం అలుపెరగని శ్రామికులలా పని చేస్తున్నారని, కష్టపడ్డ ప్రతి కార్యకర్తను పార్టీ గుర్తుపెట్టుకుంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆరు మండలాల తెలుగుదేశం పార్టీ ఇన్చార్జిలు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.






# జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా వివిధ కేసులకు రాజీ ద్వారా పరిష్కారం

-సైబర్ నేరగాళ్ల చేతిలో కోల్పోయిన 86 కేసుల్లో 27,57,454 రూ.మొత్తాన్ని సైబర్ బాధితులకు తిరిగి అందజేత.

**మెదక్ జిల్లా -29మార్చ్ (మహాప్రభ ).**
జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసిన అధికారులను, సిబ్బందిని ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ అందించారు
జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైన, రాజీ పడటానికి అవకాశం ఉన్న మరియు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించినట్లు జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ తెలిపారు. ఐపీసీ, బి ఎన్ యస్,ఎస్.ఎల్.ఎల్ : 485 కేసులు సైబర్ క్రైమ్ : 86 కేసులుఈ-పెట్టి కేసులు 90 కేసులు,డీ.డి,ఎంవీ యాక్ట్ : 527 కేసులు ఈ కేసుల్లో ఇరు వర్గాల మధ్య రాజీ కుదిర్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, క్షణికావేశంలో చేసే తప్పులను సరిదిద్దుకోవడానికి లోక్ అదాలత్ ఒక మంచి అవకాశం అని పేర్కొన్నారు. అనవసర గొడవలకు పోయి జీవితాలను ఇబ్బందులకు గురిచేయకూడదని సూచించారు. "రాజీ మార్గమే రాజమార్గం" అని, రాజీ కుదుర్చుకునే అవకాశం ఉన్న అన్ని కేసుల్లో ఇరు వర్గాలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా సైబర్ బాధితులకు సత్వర న్యాయం చేయాలనే ఉద్దేశంతో (తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో) డైరెక్టర్ శ్రీమతి శిఖా గోయల్, ఐపీఎస్ గారి ఆధ్వర్యంలో ప్రతి జిల్లాలో డి 4 సి కేంద్రాలను ఏర్పాటు చేసి, డీఎస్పీ స్థాయి అధికారుల పర్యవేక్షణలో పనిచేస్తున్నట్లు తెలిపారు. మెదక్ జిల్లాలో నమోదైన సైబర్ నేరాల్లో భాగంగా, ఈ జాతీయ మెగా లోక్ అదాలత్ సందర్భంగా 86 సైబర్ క్రైమ్ కేసుల్లో మొత్తం 27,57,454 రూ మొత్తాన్ని సైబర్ బాధితులకు తిరిగి అందించేందుకు ఆర్డర్ కాపీలను సంబంధిత బ్యాంక్ నోడల్ అధికారులకు పంపినట్లు తెలిపారు. జిల్లా ప్రజలెవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు.



## దళితుల పట్ల కౌశిక్ రెడ్డి వివక్ష తగదు

**కరీంనగర్, మార్చి 29 (మహాప్రభ):**
హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి వొడితల ప్రణవ్, సీనియర్ దళిత ఎమ్మెల్యే కడియం శ్రీహరి పట్ల అసెంబ్లీ వేదికగా కౌశిక్ రెడ్డి ప్రవర్తించిన తీరు సిగ్గుచేటు అని తీవ్రంగా విమర్శించారు. వెంటనే క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రణవ్ కార్యాలయం నుండి విడుదల చేసిన ప్రకటనలో, దళితులపై కౌశిక్ రెడ్డి వివక్ష చూపడం కొత్తేమీ కాదని, గతంలో కూడా ఇలాంటి ప్రవర్తన కొనసాగించాడని పేర్కొన్నారు. అసెంబ్లీ సాక్షిగా సీనియర్ నాయకుడిని అవమానించడం రాజకీయాల్లో మంచిది కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హుజురాబాద్ ప్రజల పరువు తీసేలా ప్రవర్తించారని మండిపడిన ప్రణవ్, వెంటనే క్షమాపణ చెప్పకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.



## ఘనంగా కోదండరామస్వామి పల్లకి సేవలు...



**శివంపేట,మార్చి 29 (మహాప్రభ):**
శివంపేట మండల కేంద్రంలో శ్రీ కోదండరామస్వామి పల్లకి సేవలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. భక్తులతో రామ రామ అంటూ ఊరేగింపు నిర్వహిస్తున్నారు. పల్లకి సేవలో భక్తులు మహిళా మణులు శ్రీరామునికి మంగళ హారతులతో స్వాగతం పలుకుతున్నారు. ఏప్రిల్ రెండవ తేదీ గురువారం రోజున గరుడసేవ నిర్వహిస్తున్నట్లు వేద పండితులు గ్రామ పురోహితులు శాస్త్రుల వామన శర్మ మరియు గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర్, ఉప సర్పంచ్ ఇసుగారి మల్లేశం ఆలయ పూజారి చందు ఒక ప్రకటనలో తెలిపారు.

## మానేరు రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌పై సమీక్షా సమావేశం



**హైదరాబాద్, మార్చి 29 (మహాప్రభ):**
అసెంబ్లీ కమిటీ హాల్‌లో మానేరు రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనులపై కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, ఇరిగేషన్, టూరిజం శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. మానేరు రివర్ ఫ్రంట్ పనుల పురోగతి, పెండింగ్ నిధులు, ప్రాజెక్టు పూర్తికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చ జరిగింది. ప్రాజెక్టును వేగవంతం చేయాలని అధికారులకు మంత్రులు ఆదేశించారు. జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారుల నుండి క్షేత్రస్థాయి నివేదికలు సేకరించారు. త్వరలో మానేరు రివర్ ఫ్రంట్‌పై మంత్రులు క్షేత్రస్థాయి పర్యటన చేపట్టనున్నారు. భూ సేకరణ, అంచనా వ్యయం, నీటిపారుదల, పర్యాటక శాఖకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

## మానేరు రివర్ ఫ్రంట్ పనులు పరిశీలించిన కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, మార్చి 29 (మహాప్రభ):**
కరీంనగర్ ఎల్‌ఎండీ రిజర్వాయర్ దిగువన నిర్మాణంలో ఉన్న మానేరు రివర్ ఫ్రంట్ పనులను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పరిశీలించారు. మున్సిపల్, రెవిన్యూ, నీటిపారుదల శాఖ, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి బ్యారేజీ నిర్మాణ స్థలాన్ని సందర్శించిన కలెక్టర్, ప్రాజెక్టు అంచనా వ్యయం, ఇప్పటివరకు పూర్తయిన పనులు, చేపట్టాల్సిన నిర్మాణాలపై వివరాలు తెలుసుకున్నారు. టూరిజం అభివృద్ధి నమూనా కింద చేపడుతున్న నిర్మాణాలు, నది లోతు, ఇరువైపులా కట్ట ఎత్తు, భూమి సేకరణ వంటి అంశాలను అధికారులు వివరించారు. మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డిఓ మహేశ్వర్, నీటిపారుదల శాఖ ఎస్ఈ రమేష్ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# దళితులు పరిపాలన చేయొద్దా?

మొదటి తరువాయి

బీఆర్ఎస్ సభ్యులు, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి సంబంధించిన దానిగా చెబుతున్న రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ వ్యవహారంపై హౌస్ కమిటీకి పట్టుబట్టారు. స్పీకర్ పోడియం వద్దకు వెళ్లి ఆందోళనకు దిగారు. ఆ సందర్భంగా సీనియర్ సభ్యుడు కడియం శ్రీహరి మాట్లాడేందుకు ప్రయత్నించగా... బీఆర్ఎస్ సభ్యుడు పాడి కౌశిక్ రెడ్డి, ఆయన వైపు వేలు చూపుతూ.. రకరకాల సైగలు చేస్తూ బెదిరించినట్టుగా వ్యవహరించారు. ఆ సందర్భంగా సభలో పెద్ద దుమారం చెలరేగింది. ఈ దశలో జోక్యం చేసుకున్న సీఎం రేవంత్ రెడ్డి ప్రధాన ప్రతిపక్షంపై నిప్పులు చెరిగారు. బీఆర్ఎస్‌ను, ఆ పార్టీ అధినేత కేసీఆర్‌నుద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీశ్‌రావు, ఆ పార్టీ సభ్యుడు కేటీఆర్‌ను ఉద్దేశించి పలుమార్లు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ వస్తే దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని చెప్పిన కేసీఆర్... వారికి పరిపాలన చేయరాదని, అందువల్ల తానే సమస్యలను పరిష్కరిస్తానని అవమానించి ముఖ్యమంత్రి పదవి చేపట్టారని విమర్శించారు. ఎస్సీని ఉప ముఖ్యమంత్రి చేసిన ఆయన.. ఆ తర్వాత అతడిని కూడా బర్తరఫ్ చేశారన్నారు. 2018లో ఎస్సీల నుంచి కొప్పుల ఈశ్వర్ ఒక్కరికే మంత్రివర్గంలో చోటు కల్పించారని గుర్తు చేశారు. అప్పట్లో ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా దళితుడైన భట్టి విక్రమార్కను ఓర్వలేకపోయారని చెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలందర్నీ లాక్కుని అపోజీషన్ లీడర్ పదవి లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు తమ ప్రభుత్వంలో ఆయన ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా హరీష్‌రావు ఉండగా



మున్సిపల్ మంత్రిగా కేటీఆర్ ఉన్నారని వివరించారు. ఉప ముఖ్యమంత్రి హోదాలో భట్టి విక్రమార్క... బడ్జెట్‌ను ప్రవేశపెడితే ఆయన్ను అవమానించేలా బీఆర్ఎస్ సభ్యులు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భట్టి విక్రమార్క, దామోదర రాజనర్సింహ, సీతక్క వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్, రామచంద్ర నాయక్, వేముల వీరేశం, అద్దంకి దయాకర్... ఇలా చెప్పుకుంటే పోతే ఎంతోమంది దళితులకు, ఆదివాసీలకు తమ ప్రభుత్వంలో పదవులు కల్పించామని చెప్పారు. ఇదీ తమ టీమ్ అని పేర్కొన్నారు. కానీ గతంలో కేసీఆర్ టీమ్‌లో హరీష్ రావు, కేటీ రామారావు, దయాకర్ రావు, వినోద్ రావు, కవితారావు, సంజరురావు... ఇలా అందరూ రావులే ఉన్నారంటూ ఎద్దేవా చేశారు. దళితులను చిన్నచూపు చూసే కేసీఆర్‌కు కనువిప్పు కలిగించేందుకే స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఎన్నుకున్నామని తెలిపారు. ఈ క్రమంలో దళితుడిని మైక్ అడగాల్సి వస్తుందనే కాఉరణంతోనే కేసీఆర్ సభకు రావటం లేదని దెప్పిపొడిచారు. ఈ రకంగా బీఆర్ఎస్ నేతలు దళితులపట్ల తీవ్రమైన వివక్షను ప్రదర్శిస్తోందని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014లో పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి, ఇతర పార్టీల్లోంచి వచ్చిన వారికి మంత్రి పదవులిచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని ఎద్దేవా చేశారు. ఇప్పుడు అదే పార్టీ నేతలు ఫిరాయింపులపై మాట్లాడటం, సభలో గోల చేయటం విడ్డూరంగా ఉందన్నారు. ఆదాయాన్ని పెంచి పేదలకు పంచాలనే విధానంతో ముందుకు వెళుతున్నామని సీఎం ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. సంస్కరణల ద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుతున్నామని తెలిపారు. రాఘవ కన్‌స్ట్రక్షన్‌కు సంబంధించి 2025లో వాస్తవ పరిస్థితులు తెలుసుకుని మైనింగ్ శాఖ నోటీసులు ఇచ్చి పన్నులు రాబట్టిందని చెప్పారు.ఏ విషయంలోనైనా ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఇంత పారదర్శకంగా తాము తీసుకున్న చర్యలను అభినందిస్తే అధికారులు మరింత ఉత్సాహంగా పనిచేసేవారని అభిప్రాయపడ్డారు. రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ వ్యవహారంపై హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ హయాంలో మూడు హౌస్ కమిటీలు వేసి, బ్లాక్ మెయిల్ చేసి ఆస్తులు గుంజుకున్నారని వివరించారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి రాజకీయ లబ్ది పొందారని వ్యాఖ్యానించారు. వారిలా హౌస్ కమిటీ వేసి రాజకీయ లబ్ది పొందాలని తాము భావించటం లేదన్నారు. అందుకే పదేండ్ల నుంచి ఇప్పటి వరకు జరిగిన ఖనిజ సంపద దోపిడీ, అక్రమ మైనింగ్‌పై సీబీసీఐడీ విచారణకు ఆదేశించామని తెలిపారు.

# బెంగాల్‌లో ఫిష్ పాలిటిక్స్..

మొదటి తరువాయి

పరిస్థితి తీసుకువస్తారని.. సీఎం మమతా బెనర్జీ ఆరోపణలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే దీదీ ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు బీజేపీ నేతలు.. చేపలను పట్టుకుని ఎన్నికల ప్రచారం చేస్తుండటం గమనార్హం. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కమలం పార్టీ అధికారంలోకి వస్తే.. బెంగాల్‌లో చేపలు సహా మాంసం, గుడ్లపై నిషేధం విధిస్తారని.. సీఎం మమతా బెనర్జీ గత కొన్ని రోజులుగా ప్రచారంలో ఇదే వ్యాఖ్యలు చేస్తున్నారు. అయితే దీదీ చేస్తున్న ప్రచారాన్ని దీటుగా బదులిచ్చేందుకు ప్రయత్నం చేస్తున్న బీజేపీ నేతలు.. ప్రచారంలో ఏకంగా చేపలను తీసుకుని తిరుగుతుండటం గమనార్హం.ఢిల్లీ నుంచి వచ్చే నాయకులకు బెంగాల్ సంస్కృతి అర్థం కాదని మమతా బెనర్జీ సంచలన ఆరోపణలు చేస్తున్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే మాంసాహారం తినడంపై ఆంక్షలు విధిస్తారని ఇటీవల చేస్తున్న ప్రచారంలో పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా పురూలియాలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న దీదీ.. ఇదే విషయాన్ని మరోసారి గుర్తుచేశారు. దేశంలోని బీజేపీ పాలిత రాష్ట్రాల్లో చేపలు తినరని.. బెంగాల్‌లో కూడా ఆ పార్టీ అధికారంలోకి వస్తే బెంగాల్ ప్రజలు కూడా మాంసం, గుడ్లు తినలేని పరిస్థితి వస్తుందని దీదీ ఆరోపించారు.ఇటీవలె బిహార్ ఉప ముఖ్యమంత్రి విజయ్ కుమార్ సిన్హా కీలక వ్యాఖ్యలు చేశారు. బిహార్‌లోని విద్యా సంస్థలు, సంతలు, ప్రధాన రహదారులు సహా బహిరంగ ప్రాంతాల్లో మాంసం, చేపల విక్రయాన్ని నిషేధించాలని ప్రకటించారు. బిహార్ ప్రజల వ్యక్తిగత ఆహార అలవాట్లను తాము గౌరవిస్తామని.. అయినప్పటికీ.. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ బిహార్ విషయాన్నే దృష్టిలో పెట్టుకుని పదే పదే విమర్శలు చేస్తున్న మమతా బెనర్జీ.. బీజేపీ బెంగాల్‌లో అధికారంలోకి వస్తే ఇక్కడ కూడా అవే ఆంక్షలే పెడుతుందని ఆరోపిస్తున్నారు.చేపలు, మాంసం తాము కూడా తింటామని.. తమ పార్టీ బెంగాల్‌లో అధికారంలోకి వస్తే మాంసాహారంపై ఎలాంటి ఆంక్షలు విధించమని తేల్చి చెప్పారు. ఇక ఇదే విషయాన్ని స్పష్టం చేసిన బీజేపీ బెంగాల్ రాష్ట్ర అధ్యక్షుడు షామిక్ భట్టాచార్య కూడా స్పష్టం చేశారు. ఆహారపు అలవాట్లను బెంగాలీలు ఎప్పటికీ వదులుకోలేరని.. శాకాహారాన్ని ప్రోత్సహించే ఉద్దేశం బీజేపీకి లేదని తేల్చి చెప్పారు.

# పొంగులేటీపై బీఆర్ఎస్ ఫైట్

మొదటి తరువాయి

శాసనసభలో చర్చ సందర్భంగా రాఘవ కన్‌స్ట్రక్షన్స్ వ్యవహారంపై సభా సంఘం (హౌస్ కమిటీ) వేయాలని బీఆర్ఎస్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్పీకర్ పోడియం వద్దకు చేరుకొని ఆందోళనకు దిగారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని వెంటనే బర్తరఫ్ చేయాలని, మైనింగ్ వ్యవహారంలో హౌస్ కమిటీ వేయాలన్న డిమాండ్లతో చప్పట్లు కొడుతూ, నినాదాలు చేస్తూ సభలో నిల్చొని ఆందోళన కొనసాగించారు. ఈ సమయంలో పెద్ద ఎత్తున మార్షల్స్ స్పీకర్ పోడియం వద్ద మోహరించారు. వెల్‌లోకి వెళ్లేందుకు యత్నించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మార్షల్స్ నెట్టివేశారు. మార్షల్స్ తీరుతో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఇతర బీఆర్ఎస్ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ తలసాని శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్ సభ్యులు వేముల ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, అనిల్ జాదవ్, కౌశిక్‌రెడ్డి నేలపై కూర్చొని నిరసన తెలిపారు.

హౌస్ కమిటీపై సీఎం, మంత్రుల తలోమాట

హౌస్ కమిటీ ఏర్పాటుపై డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చేసిన ప్రకటనకు విరుద్ధంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేయడం చర్చనీయాంశంగా మారింది. హౌస్ కమిటీ ఆరోపణలున్న శాఖలో తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి సూచనలు మాత్రమే చేస్తుందని మంత్రులు వివరించారు. హౌస్ కమిటీకి చర్యలు తీసుకొనే అధికారాలు లేవని వారు చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం ఇందుకు భిన్నంగా బాలానగర్ భూ బదలాయింపులపై హౌస్ కమిటీ వేసేందుకు సిద్ధమని అసెంబ్లీలో ప్రకటించడం గందరగోళానికి దారితీసింది. కేవలం కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఈ అంశాన్ని తెరపైకి తెచ్చారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.

బీఆర్ఎస్ హయాంలో భూ బదలాయింపులపై హౌస్ కమిటీ ప్రతిపాదనను లేవనెత్తగా.. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలతో ప్రభుత్వం శాసనసభలో మాట్లాడించడం గమనార్హం. ఈ సందర్భంగా దానం నాగేందర్, కడియం శ్రీహరి బీఆర్ఎస్ హయాంలో జరిగిన భూ బదలాయింపులపై సీఎం సూచన మేరకు హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరిని ఉద్దేశించి నాలుగు పార్టీలు మారారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. కడియం శ్రీహరి చోర్ అంటూ పాడి కౌశిక్‌రెడ్డి సహా బీఆర్ఎస్ సభ్యులు నినాదాలు చేశారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ ఎమ్మె ల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తీవ్ర స్థాయిలో బెదిరింపులకు పాల్పడ్డారు

## గల్ఫ్ నుంచి భారత తీరంవైపు రెండు ఎల్పీజీ నౌకలు

న్యూఢిల్లీ

గల్ఫ్ ప్రాంత నుంచి రెండు భారీ ఎల్పీజీ క్యారియర్ లు సురక్షితంగా భారత తీరంవైపు వస్తున్నాయి. బీడబ్ల్యూ టీవైఆర్, బీడబ్ల్యూ ఈఎల్ఎమ్ అనే ఈ నౌకల్లో సుమారు 94 వేల మెట్రిక్ టన్నుల ఎల్పీజీ ఉంది. ఈ మేరకు ఆదివారం కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం.. బీడబ్ల్యూ టీవైఆర్ నౌక మార్చి 31న ముంబైకి, బీడబ్ల్యూ ఈఎల్ఎమ్ నౌక ఏప్రిల్ 1న న్యూమంగళూరుకు చేరుకోనున్నాయి.గల్ఫ్ ప్రాంతంలో పనిచేస్తున్న భారత నౌకలు, నావికుల భద్రతకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామని, గత 24 గంటల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని ప్రభుత్వం స్పష్టంచేసింది. ప్రస్తుతం పశ్చిమ పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో 18 భారత నౌకలు, 485 మంది భారత నావికులు ఉన్నట్లు తెలిపింది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్.. నౌకల యజమానులు, భారత రాయబార కార్యాలయాలతో కలిసి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోంది. ఇందుకోసం ఏర్పాటు చేసిన డీజీ షిప్పింగ్ కంట్రోల్ రూమ్ 24ఐ7 పనిచేస్తోందని, ఇప్పటివరకు 942 మంది నావికులను సురక్షితంగా స్వదేశానికి తరలించడంలో సహాయపడిందని పేర్కొన్నది. భారత్‌లోని అన్ని ఓడరేవుల్లో కార్యకలాపాలు సాధారణంగానే కొనసాగుతున్నాయని, ఎక్కడా రద్దీ లేదని మంత్రిత్వ శాఖ వెల్లడించింది. విదేశాంగ శాఖ, ఇతర సముద్రయాన భాగస్వాములతో కలిసి నావికుల సంక్షేమం, నిరంతరాయ సముద్ర కార్యకలాపాల కోసం కృషి చేస్తున్నట్లు తెలిపింది.

## కష్టకాలంలో అండగా నిలిచారు'..

మొదటి తరువాయి

దేశాల నాయకత్వానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఇరాన్–అమెరికా మధ్య ఉద్రిక్తతల కారణంగా విమాన సర్వీసులు నిలిచిపోయినప్పుడు వేలాదిమంది భారతీయులను తమ దేశాల మీదుగా స్వదేశానికి పంపేందుకు గల్ఫ్ దేశాలు చూపిన చొరవ మరువలేనిదని ప్రధాని మోదీ అన్నారు. ఈ సంక్షోభ సమయంలో దుబాయ్, అబుదాబీ, మస్కట్ విమానాశ్రయాలు భారతీయుల తరలింపునకు కీలక కేంద్రాలుగా మారాయి. ముఖ్యంగా ఇరాన్ నుంచి భారతీయులను ఒమన్ మీదుగా తీసుకొచ్చేందుకు ప్రత్యేక అనుమతులు మంజూరు చేయడం వారి సహకారానికి నిదర్శనమని పేర్కొన్నారు.గల్ఫ్ దేశాలతో భారత్‌కు ఉన్న బలమైన దౌత్య సంబంధాల వల్లే ఎలాంటి ఆటంకాలు లేకుండా వేలాది మందిని సురక్షితంగా తీసుకురాగలిగామని ప్రధాని మోదీ చెప్పారు. 'కష్టకాలంలో ఆదుకున్న గల్ఫ్ దేశాల నాయకులకు భారత్ ఎప్పటికీ రుణపడి ఉంటుంది' అని ప్రధాని పేర్కొన్నారు. అదేవిధంగా గల్ఫ్ ప్రాంతంలో నివసిస్తున్న లక్షలాది మంది భారతీయ కార్మికులు, వారి కుటుంబాల భద్రతను పర్యవేక్షిస్తున్న ఆయా దేశాల ప్రభుత్వాలకు కూడా ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు.

## ఇరాన్‌కు షాక్..

మొదటి తరువాయి



ద్వారా చమురు సరఫరా నిలిచిపోతే ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్ ధరలు భారీగా పెరిగే ప్రమాదం ఉందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

## అదరగొట్టిన రోహిత్, రికెల్టన్..

మొదటి తరువాయి



వికెట్ల నష్టానికి 220 పరుగులు చేయగా.. ముంబయి ఇండియన్స్ మరో 5 బంతులు మిగిలుండగానే (19.1 ఓవర్లలో) 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది రోహిత్ శర్మ (38 బంతుల్లో 78; 6 ఫోర్లు, 6 సిక్సర్లు), ర్యాన్ రికెల్టన్ (43 బంతుల్లో 81; 4 ఫోర్లు, 8 సిక్సర్లు) విధ్వంసకర అర్ధ శతకాలతో ముంబయి గెలుపును ఖరారు చేయగా.. ఆతర్వాత వచ్చిన సూర్యకుమార్ యాదవ్ (8 బంతుల్లో 16; 3 ఫోర్లు), తిలక్ వర్మ (14 బంతుల్లో 20; 4 ఫోర్లు), హార్దిక్ పాండ్యా (11 బంతుల్లో 18 నాటౌట్; 3 ఫోర్లు), నమన్ ధిర్ (2 బంతుల్లో 5 నాటౌట్; ఫోర్) మ్యాచ్‌ను లాంఛనంగా ముగించారు. కెకెఆర్ బౌలర్లలో వైభవ్ అరోరా, కార్తీక్ త్యాగి, సునీల్ నరైన్ తలో వికెట్ తీయగా.. రికెల్టన్‌ను అనుకూల్ రారు అద్భుతమైన డైరెక్ట్ త్రోతో రనౌట్ చేశాడు. అంతకుముందు రహానే (40 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్ల సాయంతో 67 పరుగులు), ఫిన్ అలెన్ (17 బంతుల్లోనే 6 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 37 పరుగులు), అంగ్క్రిష్ రఘువంశీ (29 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 51 పరుగులు), రింకూ సింగ్ (21 బంతుల్లో 4 ఫోర్ల సాయంతో 33 నాటౌట్) సత్తా చాటడంతో కేకేఆర్ భారీ స్కోర్ చేసింది. కేకేఆర్ ఇన్నింగ్స్‌లో కెమరూన్ గ్రీన్ (18) ఒక్కడే నిరాశపరిచాడు. ముంబై ఇండియన్స్ బౌలర్లలో శార్దూల్ ఠాకూర్ (4-0-39-3), ట్రెంట్ బౌల్ట్ (4-0-38-0) అద్భుతంగా బౌలింగ్ చేయగా..హార్దిక్ పాండ్యా ఓ వికెట్ తీశాడు.

## ఏప్రిల్ రెండో వారంలో ఇంటర్ ఫలితాలు

మొదటి తరువాయి




అన్ని క్యాంపుల్లో మూల్యాంకనం ముగియడంతో ఫలితాల క్రోడీకరణ పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు.అయితే ఈ సారి సమాధాన పత్రాల రీ వెరిఫికేషన్ చేయించనున్నారు. సింగిల్ సబ్జెక్టు ఫెయిలైన వారితోపాటు ఒక్కో సబ్జెక్టులో కొన్ని జవాబుపత్రాలను ర్యాండమ్‌గా వెరిఫికేషన్ చేయించనున్నారు. ఆ తర్వాత సీజీజీలో ట్రయల్స్ నిర్వహించి అంతా సవ్యంగా ఉంటేనే ఫలితాలు విడుదల చేస్తారు. వాస్తవానికి ఏప్రిల్ 6వ తేదీనే ఫలితాలు విడుదల చేయాలని భావించినా, బడ్జెట్ సమావేశాలు, ఇతర పనులతో రెండో వారానికి వాయిదావేశారు.

## టార్గెట్ అమెరికా!

మొదటి తరువాయి

సమాచారం ప్రకారం... ఈ పరీక్ష దేశం ఐదేండ్ల సైనిక విస్తరణ ప్రణాళికలో భాగంగా జరిగింది. ఈ ప్రణాళికలో ప్రధాన లక్ష్యం 'వ్యూహాత్మక దాడి సామర్థ్యాలను' అభివృద్ధి చేయడం. అంటే అణు సామర్థ్యం గల అంతర్మహాద్వీప క్షిపణులు (ఐసీబీఎంలు) తయారు చేయడం. ఈసారి పరీక్షించిన సాలిడ్-ఫ్యూయల్ ఇంజిన్ అత్యధిక త్రస్ట్ 2500 కిలో టన్నులుగా నమోదైంది.

## అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్

మొదటి తరువాయి

బండారు లక్ష్మారెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, మాణిక్‌రావు, పద్మారావు, చింతా ప్రభాకర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేష్, విజయుడు, కెపి వివేకానంద, అనిల్‌జాదవ్, కోవా లక్ష్మి ఉన్నారు. కడియం శ్రీహరిని తన హావభావాలతోపాటు బాడీ ల్యాంగేజ్ ద్వారా అవమానించినందుకు కఠిన చర్యలు తీసుకునేందుకు ఎథిక్స్ కమిటీకి సిఫారసుచేయాలంటూ సభ తీర్మానించింది. కాగా ఈ ప్రభుత్వంలో అసెంబ్లీ నుంచి గుంతకండ్ల జగదీష్‌రెడ్డి సస్పెండ్ కావడం ఇది రెండోసారి.

## సంపాదకీయం

# ఆనతినీయవా! ప్రభూ!



"నేను ఖమ్మం భారతమ్మ గారి దుకాణంలో నెలవారి సరుకులు కొనుక్కుంటాను. దయచేసి అనుమతి ఇవ్వగలరు. భవదియుడు- సీతారాం". ఇది నిన్న ఫేస్‌బుక్‌లో కవి మిత్రుడు పెట్టిన సాదాసీదా పోస్టు. దీనికి లైక్‌కొడుతూ "నేను కరుణ మెడికల్స్‌లో మందులు ఈ వారానికి కొనుక్కోవాలి. అనుమతించండి" అని కామెంట్ పెట్టాను.కొందరికి ఈ పోస్టు అంతరార్థం అర్థం కాలేదు.కొందరు ఇట్టే పసికట్టేసారు. 146కోట్ల ప్రజల ఆత్మగౌరవంపై ఎక్కుపెట్టిన అస్త్రం అది. ఒక దేశం పరువుకు సంబంధించిన సమస్య. ఇంతకన్న వ్యంగ్యంగా కవి ఏం వివరించగలడు! ఎంత బాధను అవేదనను కడుపులో దాచుకుంటే ఆ మాటలు పెల్లుబుకాయి. ఇంతకన్న దీనంగా ఏం దేబురించగలడు! జరుగుతున్న సంఘటనలు, పరిణామాలు, ఎవరినీ కదిలించడం లేదేమీ! మనుషులు, దేశ ప్రజలు, బుద్ధిజీవులు ప్రతిస్పందించడం మానుకున్నారా? నాకెందుకులే అని ఊరుకుంటున్నారా! ఇంతకన్న దారిద్ర్యం ఏముంది! సిగ్గుపడేలా చేస్తున్న ఈ దిగజారుడుతనం తలవంపులు కలిగించడం లేదూ! తూటాలకు కూడా వెరవకుండా వందేమాతరం అంటూ మూడు రంగుల జెండాను పైకెగరేస్తూనే ప్రాణాలు వొదిలిన త్యాగధనుల నేల వారసత్వమేనా ఇంత దిగజారింది! స్వేచ్ఛ కోసం, స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన వీరులగన్న గడ్డ, ఆ పౌరుషత్వాన్ని ఎందుకు, ఎలా కోల్పోయింది. మాట్లాడితే యాభై ఆరించుల ఛాతీగల ధైర్యంగా చెప్పుకున్న వాళ్లు, గొంతులోంచి చిన్నమాటను ఉపయోగించడం లేదెందుకు! వాడు పబ్లిక్‌గానే రష్యాదగ్గర, ఇరాన్ దగ్గర చమురు కొనవద్దన్నప్పుడూ ఒక్కమాట పెగల్లేదు. దానికి బదులుగా నా దగ్గరే కొనాలని హుకుం జారీచేసినా, తల ఊపాం తప్ప, ఏమీ మాట్లాడలేదు. ఇప్పుడు యుద్ధ సందర్భంగా, ఒక నెలరోజులు మీకు వెసులుబాటు కలిపిస్తున్నాను.రష్యా దగ్గర కొనుక్కోండి అని నెలరోజుల స్వాతంత్ర్యాన్ని ప్రకటించినపుడూ, డూడూ బసవన్నలా ఊపేసాం. మేము ఫలానా దేశం దగ్గర కొనుక్కుం టాము. మాకు అనుమతి ఇవ్వండి అనీ ఆర్జీ పెట్టుకోవడం ఏం తెలియజేస్తున్నది! మన డబ్బులు, మన స్వతంత్ర దేశం, సార్వభౌమ దేశం, ఎవరినుంచి కొనాలన్నా ట్రంపుగారి అనుమతి పొందాలి. ఈ సందర్భాన్ని కవి ఎంత సూటిగా, ముఖం మీద కొట్టినట్టు చెప్పాడు. అయిననూ మనవాళ్లకు చలనం కలిగిందా, ఏమో! రవి అస్తమించని సామ్రాజ్యవాదాన్ని గడగడలాడించి తరిమికొట్టిన అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్, సుభాష్ చంద్రబోస్, కొమురంభీమ్, ఆజాద్ చంద్రశేఖర్ లాంటి యోధానుయోధుల వీరచరితగల దేశం అమెరికా ఆజ్ఞలకు తలవంచడం, మనదేశ స్వాతంత్ర్య సార్వభౌమత్వాలను కోల్పోవడం కాదా! ప్రజలు, ప్రాంతాలు, జాతులు, మతాలు ఎన్ని రకాలుగా ఉన్నప్పటికీ, వైవిధ్యాలతో కొనసాగినప్పటికీ స్వేచ్ఛ కోసం పోరాడుతుంటే, వారికి కూడా సంఘీభావంగా నిలిచి, మద్దతు ప్రకటించిన అలీన ఉద్యమాన్ని నడిపిన, నాయకత్వం వహించిన దేశంగా పేరు పొందిన వాళ్లం మనం. ఇప్పుడు అమెరికా, ఇజ్రాయిల్, అంతర్జాతీయ చట్టాలకు, న్యాయసూత్రాలకు వ్యతిరేకంగా ఇరాన్‌పై దాడులు చేస్తుంటే, ఇది సరికాదు, అని చెప్పలేకపోయాం. కనీసం మనకు ఎప్పటినుంచో స్నేహితుడు అయిన ఇరాన్ నేతను హత్యచేస్తే, ఖండించడం అటుంచి, సంతాపమూ వెంటనే ప్రకటించలేని అసహాయ, అమానవీయస్థితికి దిగజారిపోయాం. 165 మంది చిన్నపిల్లలను అతి దారుణంగా బాంబులేసి చంపేసినా చలించకపోవడం, ఖండించకపోవడం ఎంత అన్యాయం! రెండు వందల యేండ్లు సామ్రాజ్యవాదంతో పోరాడిన వారసత్వం, నేడు ప్రపంచాన్ని యుద్ధ బీభత్సంలోకి దింపిన సామ్రాజ్యవాద అమెరికాకు సాగిలపడటం ప్రభుత్వ వైఫల్యానికి, లొంగుబాటుకు నిదర్శనం. ఎందుకీ లొంగుబాటు! ఈ నాయకుల రహస్య చిట్టాలేమయినా ట్రంపు తన చేతిలో పెట్టుకుని ఉన్నాడా! ఎప్‌స్టీన్ ఫైల్స్‌లోని నిజా నిజాలు ఇంకా బయటపడాల్సి ఉంది. 'హతులెవరో తెలుసు, హంతకులెవరో తెలుసు, అయినా, అన్యాయం అని అనకపోవడమే అసలు నేరం! కదా! అపార దేశ భక్తిగల వాళ్లు మనల్ని పరిపాలిస్తున్నారని ప్రజలు భ్రమపడుతున్నారు. దేశాన్ని నిర్లజ్జగా అగ్రరాజ్య ఆజ్ఞలకు తలొగ్గడం ప్రత్యక్షంగా చూస్తున్నాము. ఇంతటి వెన్నెముక లేని దేశంగా గతంలో ఎప్పుడూ లేదు. ఇప్పటికయినా ప్రజలు అప్రమత్తమయి, ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రతిస్పందించాల్సి ఉంది. లేదంటే స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు కోల్పోతాము.

# అగ్ని ప్రమాదంతో నివాసం గుడిసె దగ్ధం

**అగ్ని ప్రమాదం తప్పిన - ప్రాణ ప్రాణపాయం**

**దుబ్బాక – మార్చి 29 (మహాప్రభ)**
సిద్దిపేట జిల్లా అక్బర్ పేట భూంపల్లి మండలం ఎనగుర్తి గ్రామంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది గ్రామానికి చెందిన ముత్యం పల్లి లావణ్య అనే మహిళ నివసిస్తూనా పూరి గుడిసెలో మంటలు ఎగిసిపడ్డాయి , మంటలు వ్యాపించిన సమయంలో లావణ్య ఇద్దరు చిన్నారులు చిన్నారులు మాత్రమే ఉన్నట్లు తెలిపారు , వెంటనే గమనించిన చిన్నారులు గుడిసెలో నుండి బయటకు పరుగులు తీయడంతో స్థానికులు అక్కడికి చేరుకొని మంటలు హార్పే



ప్రయత్నం చేశారు . గుడిసెలో మంటలు ఒక్కసారిగా ఎగిసిపడడంతో ఇంట్లో ఉన్న సామాగ్రి తో పాటు బట్టలు నిత్యవసర సరుకులు నగదు డ్వాక్రా గ్రూపు డబ్బులు 50,000 రూపాయలు కాళీ బూడిద అయినట్లు లావణ్య బోరుణ వెలిపించారు , సంవత్సరం క్రితం తన భర్త చనిపోవడం జరిగిందని నివసించడానికి ఇల్లు కూడా లేకపోవడంతో పూరి గుడిసెలో ఉండడం జరుగుతుందన్నారు , నివాసముంటున్న పూరిగుడిసెలో సైతం మంటలతో కాలిపోవడంతో రోడ్డున పడ్డామని కంటతడి పెట్టారు , స్థానికులు మంటలను ఆర్పడానికి ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు అగ్ని ప్రమాదంతో ఎంతో నష్టం వాటిల్లిందో ఇంకా తెలియాల్సి ఉంది, బాధిత మహిళ కుటుంబాన్ని ప్రభుత్వంతోపాటు మానతవాదులు ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు ,

# మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించిన మహోన్నతుడు ఎన్టీఆర్

**వస్కుల కృష్ణయ్య నియోజకవర్గ ఇంచార్జ్ ( తెలుగుదేశం పార్టీ)**





**దేవరకొండ మార్చి 29( మహాప్రభ )**
తెలుగుదేశం పార్టీ 44 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దేవరకొండ లో లితెలుగుదేశం పార్టీ దేవరకొండ నియోజకవర్గ ఇంచార్జ్ వస్కుల కృష్ణయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది . తెలుగుదేశం పార్టీ జెండా ఎగరవేయడం జరిగింది వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ 1982 మార్చి 29న స్థాపించి కేవలం 9 నెలల లోనే అధికారంలోకి తీసుకువచ్చిన నాయకుడు అన్న ఎన్టీఆర్. సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు అనే నినాదంతో తెలుగుదేశం పార్టీని స్థాపించి అధికారంలోకి వచ్చిన తర్వాత పటేల్ పట్వారి వ్యవస్థను రద్దు పరచి అదేవిధంగా రెండు రూపాయల కిలో బియ్యం జనతా వస్త్రాలు రైతులకు విద్యుత్తు 50 రూపాయలకే అందించిన ఘనత అన్న ఎన్టీఆర్ దక్కింది. ప్రతి పేదవానికి కూడు గూడు గుడ్డ అందినప్పుడే నిజమైన స్వాతంత్రం వచ్చినట్లు అని ఆరోజు ఎన్టీఆర్ చెప్పారు అదేవిధంగా తాలూకాలను రద్దుచేసి మాండలిక వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల దగ్గరకు పాలను తీసుకువచ్చినారు తెలుగుదేశం పార్టీ మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించిన మహాయుగ పురుషుడు అన్న ఎన్టీఆర్ తెలుగువారి ఆత్మగౌరవం కోసం పుట్టిన పార్టీ తెలుగుదేశం పార్టీ తెలుగువారి కీర్తి ప్రతిష్టలు యావత్ ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ ఆయన చూపించిన మార్గంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వాటిని ముందు తీసుకు వెళుతున్నారు అటువంటి పార్టీలు మేము ఉండడం మాకు ఎంతో గర్వకారణం అని కృష్ణయ్య తెలియజేశారు రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# సివిల్ సప్లై అధికారులు న్యాయం చేయాలి

**-చిరు వ్యాపారుల విన్నపం**




**దేవరకొండ మార్చి 29( మహాప్రభ )**
రోడ్డుపై స్టాల్స్ మొదలుకొని రెస్టారెంట్ల వరకు ఏ చిన్న తిను పదార్థాల బండిపై గ్యాస్ తోనే వ్యాపారాలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం దేవరకొండ పట్టణంలో డెమోస్టిక్స్ సిలిండర్ల కొరత కారణంగా గత్యంతరం లేక కమర్షియల్ సిలిండర్లు వాడడం అవి వెంటనే సివిల్ సప్లై ఎన్ఫోర్మెంట్స్ అధికారులు సిలిండర్లను స్వాధీనం చేస్తుండడంతో చేయడంతో దిక్కు తోచని స్థితిలో రోడ్డుపై తినుబండారాల కట్లలీస్ గప్చుప్ దోషబండ్ల ఫాస్ట్ ఫుడ్ భోజన హోటల్స్ రెస్టారెంట్లు వ్యాపారులు గందరగోళంలో అయోమయ పరిస్థితిలోకి వెళ్లారు.దేవరకొండ పట్టణంలోని తినుబండారాలు హోటల్ గప్చుప్ రెస్టారెంట్ టీ స్టాల్ లో ఫాస్ట్ ఫుడ్ మిర్చి బండి దోష బండి వ్యాపారం చేసే గత నెల రోజులుగా మార్కెట్లో కమర్షియల్ సిలిండర్లు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందికి గురవుతున్నామంటూ దేవరకొండ పట్టణానికి చెందిన చిరు వ్యాపారులుతెలిపారు. ఆదివారం వ్యాపారులంతా కలిసి గత్యంతరం లేక కమర్షియల్ సిలిండర్లను వాడుతున్నామని తమకు సివిల్ సప్లై అధికారులు డెమోస్టిక్ సిలిండర్లు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అర్థాంతరంగా సిలిండర్లను సీజ్ చేసి ఫైన్లు వేస్తే తమ కుటుంబాలు ఎలా బతుకుతాయని వారు తెలిపారు. సమస్యలను అధిగమించేందుకు తమకు పరిష్కారం చూపాలని తెలిపారు.

# బెట్టింగ్‌కు అలవాటు పడి యువత ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు


**-బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు**
**-జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు, ఐపీఎస్.**



**మెదక్ జిల్లా – మార్చి 29 (మహాప్రభ)**
జిల్లాలో ఎవరైనా క్రికెట్ లేదా ఇతర బెట్టింగ్‌లకు పాల్పడినా, ప్రోత్సహించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ హెచ్చరించారు. ఇటీవల కాలంలో సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో యువత క్రికెట్ బెట్టింగ్ మోజులో పడి తమ భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతున్నారని తెలిపారు. యువత బెట్టింగ్‌ల వైపు వెళ్లి ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా, కొన్ని సందర్భాల్లో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఐపీఎల్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యంగా వారు మొబైల్ ఫోన్ వినియోగం, ప్రవర్తనను గమనించాలని, అనుమానాస్పద మార్పులు కనిపిస్తే వెంటనే స్పందించాలని తెలిపారు. జిల్లాలో బెట్టింగ్‌లను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, ఆధునిక సాంకేతికతతో పాటు టాస్క్‌ఫోర్స్ మరియు ప్రత్యేక బృందాల సహకారంతో నిఘా పెంచుతున్నామని పేర్కొన్నారు. జిల్లాలో ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడినా, ప్రోత్సహించినా కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బెట్టింగ్‌లపై సమాచారం ఉన్నవారు వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100, అలాగే జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712657888 కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

# చెత్తాచెదారం తో కూడిన కళ్ళు విక్రయాలు.

**-ఇదేమిటని ప్రశ్నిస్తే నా ఇష్టం అంటున్న యజమాని.**
**- పడాలపల్లి లంబరాజు యాదవ్.**



**తూప్రాన్, మార్చి 29 (మహాప్రభ)**
మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ బ్రాహ్మణపల్లి పరిధిలోని కళ్ళు దుకాణంలో చెత్తాచెదారంతో కూడిన కల్లును విక్రయిస్తుండగా కళ్ళు తీసుకొనుటకు వచ్చిన లంబ రాజు యాదవ్ చెత్త కల్లు పంపిణీ చేయడం ఏమిటని ఇలా త్రాగితే ప్రజల ఆరోగ్యాలు ఏమవుతాయని ప్రశ్నించగా నా ఇష్టం నేను ఇదే విధంగా కళ్ళు విక్రయిస్తాను నీకు ఇష్టం ఉంటే తీసుకో లేకుంటే వెళ్ళిపో అంటూ బెదిరింపులకు గురి చేశాడని పడాలపల్లి లంబ రాజ్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా లంబరాజు యాదవ్ మాట్లాడుతూ ఎండాకాలం సీజన్లో కల్లు సేవిస్తే చలువ చేస్తుందని సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు ఆశగా వచ్చి కళ్ళు సేకరించడం జరుగుతుందని ఇలాంటి చెత్త కళ్ళు విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న కళ్ళు దుకాణ్ యజమాని పై ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని రాజు యాదవ్ అన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన

**-ఏడాదికాలంగా పెండింగ్లో ఉన్న సమస్యలకు పరిష్కారం**
**-లబ్ధిదారులకు సొంత పిల్ల కళా సహకారం , ఎన్నో**
**నిర్మాణానికి భూమి పూజ చేసిన బొప్పాపూర్ సర్పంచ్**





**దుబ్బాక - మార్చ్ 29 (మహాప్రభ )**
సర్పంచ్ మాధవనేని భానుప్రసాద్ ముందడుగు గ్రామ అభివృద్ధికి కొత్త దిశ , సిద్దిపేట జిల్లా అక్బర్ పేట భూంపల్లి మండలం బొప్పాపూర్ గ్రామంలో చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల సమస్యకు ఈరోజు పరిష్కారం లభించింది , గ్రామ సర్పంచ్ మాధవనేని భాను ప్రసాద్ వారి ఆధ్వర్యంలో 4 లబ్ధిదారుల ఇళ్లకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించబడింది , ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించిన నిధులతో ఇల్లు నిర్మించడానికి లబ్ధిదారులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటూ , ఈ సమస్య గత ఒక్క సంవత్సరం నుంచి పెండింగ్ లో ఉంది , ఈ విషయాన్ని గమనించిన సర్పంచ్ స్వయంగా ముందుకు వచ్చి , కొంతమంది స్నేహితులు మరియు సహకారాలతో కలసి కేటాయించిన బడ్జెట్ లోనే ఇల్లు నిర్మించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు , లబ్ధిదారులు గవ్వల మమత , దుంపలపల్లి కల్పన, బొట్ల వజ్రవ్వ , ఈదుగళ్ల బాబు, ఈరోజు సర్పంచి వారి చేతుల మీదగా శంకుస్థాపన జరగడంతో లబ్ధిదారులు ఆనందం వెల్లివిరిసింది , వారి సొంత ఇంటి కల నెరవేరే దిశగా ఇది ఒక ముఖ్యమైన అడుగుగా నిలిచింది , ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోనాపురం పద్మ , వార్డు సభ్యులు బండమీది క్రాంతి , పర్స పర్శరాములు , గవ్వల బుజ్జి , సీనియర్ నాయకులు పరిగి కృష్ణ గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే ముగ్గురు మృతి



**గాంధారి - మార్చి 29 (మహాప్రభ)**
కామారెడ్డి జిల్లా గాంధారి మండలం ఎస్ ఐ ఆంజనేయులు, తెలిపిన వివరాల ప్రకారం రాంపూర్ గడ్డ సమీపంలో శనివారం రాత్రి సమయంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి పల్టీ కొట్టడంతో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మరణించారు. రాంపూర్ గడ్డ భావన రైస్ మిల్లులో పనిచేస్తున్న బిహార్, ఉత్తరప్రదేశ్కు చెందిన ముగ్గురు కార్మికులు గాంధారి వైపు బైక్పై వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అధిక వేగంతో వెళ్తున్న బైక్ రాంపూర్ గడ్డ కల్వర్ట్ వద్ద స్కిడ్ అయ్యి, రోడ్డు కిందకు దూసుకెళ్ళడంతో బాధితుల తల, ముక్కు, చెవుల నుంచి తీవ్రంగా రక్తస్రావమైంది. గమనించిన స్థానికులు వెంటనే 108 సిబ్బందితో పాటు పోలీసులకు సమాచారం అందించగా.. క్షతగాత్రులను పరిశీలించిన వైద్య సిబ్బంది.. ప్రాణాలు కోల్పోయినట్టుగా నిర్ధారించారు. మృతులను లాల్తూర్ ముఖియా(21), రాహుల్ (21), జావీద్ అంసారి (22)గా గుర్తించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. అధిక వేగం జీవితాన్ని అంతం చేయకూడదని,వాహనదారులు డ్రైవింగ్ సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని గాంధారి ఎస్ఐ ఆంజనేయులు సూచించారు. తల్లిదండ్రులు సూచనలు వేసవి కాలం పిల్లలకు సెలవులు వస్తున్నాయి. పిల్లల పట్ల డ్రైవింగ్ విషయంలో జాగ్రత్తలు పాటించాలని ఎస్ ఐ ఆంజనేయులు, పేర్కొన్నారు.

## మద్యం తాగి వేధిస్తున్న కుమారులపై

# ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు.....!



**దుబ్బాక -- మార్చి 29 (మహాప్రభ)**
నిత్యం మద్యం తాగి వచ్చి , తల్లిదండ్రులను తిడుతూ , చంపుతామని బెదిరిస్తున్న కుమారులపై తల్లిదండ్రులు ఫిర్యాదు చేసిన ఘటన దుబ్బాక పట్టణంలో ఆదివారం జరిగింది , దుబ్బాక సిఐ, రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన కంచం కనుకయ్య , రాజవ్వతులకు ముగ్గురు కుమారులు నరేష్ , స్వామి , ఎల్లం , ఒక కుమార్తె కవిత ఉన్నారు . వీరికి ఒక ఇల్లు తో పాటు ఆరు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది , రెండవ కుమారుడు స్వామి , మూడవ కుమారుడు ఎల్లం , ప్రతిరోజు మద్యం సేవించి , తల్లిదండ్రులను ఇష్టం వచ్చినట్లు దూషిస్తూ ఇంట్లో నుంచి వెళ్లిపోవాలని , లేదంటే చంపుతామని బెదిరిస్తున్నట్టు తల్లిదండ్రులు వాపోయారు , గతంలో ఇలాంటి బెదిరింపులకు పాల్పడితే ఇప్పటి దుబ్బాక సీఐ , వారి కుమారులను పోలీస్ స్టేషన్కు పిలిపించి కౌన్సెలింగ్ కూడా ఇచ్చారు . అయినప్పటికీ కుమారుల వేధింపులు ఆగలేదు , ఈ కార్యక్రమంలో వారి వేధింపులు భరించలేక , ప్రాణభయంతో ఆ వృద్ధ తల్లిదండ్రులు బతుకుదెరువు కోసం నాలుగు రోజుల క్రితం సిద్దిపేటకు, వెళ్లి అక్కడి రోడ్లమీద నివాసమున్నారు. రెండు రోజుల క్రితం వృద్ధ తల్లిదండ్రులు స్థానికుల సహాయంతో సిద్దిపేట పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కొడుకుల వేధింపులు భరించలేకపోతున్నామని , తమకు ప్రాణహాని ఉందంటూ ఇద్దరు కుమారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. దీనితో దుబ్బాక సిపి సాధన రష్మీ పెరుమాళ్ ఆదేశాల మేరకు ఆదివారం దుబ్బాక సర్కిల్ కార్యాలయంలో సిఐ టి. రాజేష్, ఎస్ ఐ, కీర్తి రాజు ఆధ్వర్యంలో వృద్ధ తల్లిదండ్రులను , వేధిస్తున్న ఇద్దరు కొడుకులను పిలిపించి , వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు , అనంతరం తల్లిదండ్రులను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కుమారులను హెచ్చరించారు , సిపి ఆదేశాల మేరకు ముగ్గురు కుమారులపై , కుమార్తెపై , కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

# అత్యవసర సమయంలో రక్తదానం చేసిన నవీన్ రెడ్డి



**కామారెడ్డిజిల్లా- మార్చి 29 (మహాప్రభ)**
కామారెడ్డి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన జ్యోతి అనే పేషంట్ కి ఏ నెగెటివ్ రక్తం అవసరం కావడంతో పేషంట్ కుటుంబసభ్యులు కామారెడ్డి జిల్లా రక్తదాతల సేవా సమితి నిర్వాహకులను సంప్రదించడంతో ఒక్క ఫోన్ కాల్ తో వెంటనే స్పందించిన రాజంపేట్ మండలకేంద్రానికి చెందిన నవీన్ రెడ్డి ఒక ప్రాణాన్ని కాపాడాలనే ఉద్దేశంతో వెంటనే వచ్చి రక్తం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సేవా సమితి నిర్వాహకులు ముదాం శ్రీధర్ పటేల్ మాట్లాడుతూ రక్తం దానం చేస్తే మళ్లీ రక్తం వస్తుంది కానీ, రక్తం అందక పోయిన ప్రాణం తిరిగి రాదు.మనం చేసే రక్తదానం వలన వెలకట్టలేని విలువైన ప్రాణం రక్షించబడుతుంది.... యువత మానవత్వంతో స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు వచ్చి ప్రాణదాతలు కావాలని తెలుపడం జరిగిందిఈ సందర్భంగా ఒక్క ఫోన్ కాల్ చేయగానే వచ్చి రక్తదానం చేసిన నవీన్ రెడ్డి కి జిల్లా రక్తధాతల సేవా సమితి నిర్వాహకులు బోనగిరి శివకుమార్, ముదాం శ్రీధర్ పటేల్ కృతజ్ఞతలు తెలిపారు . ఈ కార్యక్రమంలో పేషంట్ కుటుంబసభ్యులు,ఖదీూ బ్లడ్ సెంటర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# కరాటే పోటీలలో మెదక్ విద్యార్థుల ప్రతిభ.



**మెదక్ జిల్లా - మార్చి 29 (మహాప్రభ)**
రాష్ట్ర స్థాయి కరాటే పోటీలలో మెదక్ విద్యార్థులు ప్రతిభ కనబరచారని కరాటే మాస్టర్ దినాకర్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెదక్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్ లో రాష్ట్రస్థాయి కరాటే పోటీల ను రెంజుకి షోతోకన్ కరాటే, నగేష్ మాస్టర్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి ఈ పోటీలకు 800 మంది విద్యార్థులు పాల్గొన్నారని అన్నారు.ఈ పోటీల్లో మెదక్ పట్టణానికి మొత్తం 114 పాయింట్స్ తో చాంపియన్గా నిలిచిందని తెలిపారు మెదక్ పట్టణ కేంద్ర విద్యార్థులు దక్షిక, సహస్ర, సాయిశమీక్ష, అనన్య, జయశ్రీ, సాన్విక,విలసిని, బాయ్స్ విభాగంలో విహాన్, ఈశ్వర్ చంద్ర, నాగాక్షిత్, కృతిక్, కౌషిక్, శ్రీయస్, శివాన్స్, త్రీజల్, రానవీర్, సాయి చరణ్, విహాన్ లు మొత్తం 20 గోల్డ్ మెడల్స్ సాధించినట్టు వారి తెలిపారు.

# నీటి సమస్య పరిష్కారమే లక్ష్యం


**- సర్పంచ్ పద్మ జగన్**



**పాపన్నపేట,**
**మార్చ్ 29 :( మహా ప్రభ )**
వేసవిలో గ్రామ ప్రజలకు నీటి సమస్యలు లేకుండా తగు చర్యలు చేపట్టినట్లు కొత్తపల్లి సర్పంచ్ కుమ్మరి పద్మ జగన్ తెలిపారు. ఆదివారం గ్రామం లోని 8 వార్డు,5 వార్డులో నూతన మోటార్లు,స్టార్టర్లు బిగించారు. ఈసందర్భంగా ఉపసర్పంచ్ వాంకిడి రాము,వార్డు సభ్యులు..సుజాత, రామక్రిష్ణ, దుర్గయ్య,లక్ష్మి,నాయకులు కృష్ణ,శ్రీను.
కుమార్,నరహరి,ఎల్లప్ప,మల్లేశం తదితరులు ఉన్నారు.

# ఘనంగా జరిగిన మట్టల ఆదివారం





**దేవరకొండ మార్చి 29( మహాప్రభ )**
దేవరకొండ పట్టణంలోని చర్చిలలో “ మట్టల ఆదివారం పండగను “ పురస్కరించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు దేవరకొండ మిషన్ కాంపౌండ్ లోనే ఎంబి జాయిన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పాస్టర్ రెవరెండ్, వేణు ప్రార్థనలో చేశారు స్థానిక బాప్టిస్ట్ చర్చిలో రెవరెండ్ జోసెఫ్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మట్టల ఆదివారం ప్రత్యేకతను వివరించారు ఏసుక్రీస్తు ప్రభువుల వారు సమాజంపై ప్రేమ చూపి, లోకమును ఎంతో ప్రేమించాలని తెలిపారు, ప్రపంచంలో శాంతి సమాధానం కలగాలని ప్రార్థనలు చేశారు, స్థానిక షాలోమ్ ఆశ్రమ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు, తూర్పు పాలెం ఒలీవల ప్రార్థన మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు, కొండమల్లేపల్లి లోని శిలోహ చర్చిలో ప్రార్థన కార్యక్రమాలు పాస్టర్ రెవరెండ్ దేవకుమార్ చేశారు, దైవజనులు రెవరెండ్ ఎలీషా పాస్టర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు, ఈ కార్యక్రమంలో విశ్వాసులు, నాయకులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు

# ఉమ్మడి దేవరకొండ మండల బిజెపి ప్రశిక్షణ శిబిరం ఘనంగా నిర్వహణ



**దేవరకొండ మార్చి 29( మహాప్రభ )**
భారతీయ జనతా పార్టీ ఉమ్మడి దేవరకొండ మండలం ఆధ్వర్యంలో “పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్-2026” మండల స్థాయి ప్రశిక్షణ శిబిరం అత్యంత ఉత్సాహంగా నిర్వహించబడింది. పార్టీ కార్యకర్తల క్రమశిక్షణ, సిద్ధాంతాల అవగాహన మరియు భవిష్యత్ కార్యాచరణే లక్ష్యంగా ఈ శిక్షణ తరగతులు జరిగాయి.ఈ కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులు పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కళ్యాణ్ నాయక్, మాజీ రాష్ట్ర కార్యదర్శి ప్రకాష్ రెడ్డి , బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేతావత్ లాలునాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వినోద్ రాథోడ్, గుండాల అంజయ్య,నేనావత్ రాము నాయక్, కె. బాలు,తిరుపతి గౌడ్,ఎర్ర బిక్షపతి,A. బాలరాజు మరియు ఇతర ముఖ్య నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులోకి



**తాడ్వాయి-మార్చి 29 (మహాప్రభ)**
మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయానికి పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులోకి వచ్చినట్లు ఇన్చార్జి గ్రంథపాలకుడు పుల్లూరి రాజలింగం తెలిపారు.
నిరుద్యోగ యువత అభ్యర్థన మేరకు దాతల సహకారంతో ఈ పుస్తకాలను సమకూర్చినట్లు చెప్పారు. తెలంగాణ ఉద్యమ చరిత్ర, భారతదేశ చరిత్ర, కరెంట్ సైన్స్ అండ్ టెక్నాలజీ, తెలంగాణ ఆర్థిక వ్యవస్థ, భూగోళ శాస్త్రం, అంకగణితం తదితర అంశాలకు సంబంధించిన పుస్తకాలను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, అందజేసినట్లు వెల్లడించారు. పాఠకుల కోరిక మేరకు తక్షణమే పుస్తకాలు అందించడంతో నిరుద్యోగ యువకులు చైర్మన్,కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంతోష్, స్వామి, సతీష్, శివ, తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మహత్యకు ప్రయత్నం చేసిన వృద్ధురాలిని కాపాడిన తూప్రాన్ పోలీసులు



**తూప్రాన్,మార్చి 29 (మహా ప్రభ)**
మెదక్ జిల్లా తూప్రాన్ పెద్ద చెరువులో దూకి ఆత్మహత్యకు ప్రయత్నం చేసిన ఓ వృద్ధురాలిని తూప్రాన్ పోలీసులు రేస్క్యూ టీం కాపాడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళ్తే మెదక్ జిల్లా శివంపేట మండలం దంతాన్ పల్లి గ్రామానికి చెందిన గజేంద్రుల బాలమణి(75) భర్త:లక్ష్మి నారాయణ కొద్దిరోజులుగా అనారోగ్యం సమస్యలతో బాధపడుతోంది. ఈ కారణం వల్ల బతుకుపై విసుగు చెందిన బాలమణి తూప్రాన్ చెరువు కట్ట బతుకమ్మ ఘాట్ మెట్ల మీదుగా చెరువులోకి ఆత్మహత్య చేసుకొనుటకు దిగగా చెరువుకట్ట మీదుగా వెళ్తున్న వారు ఈ విషయం గమనించి 100 కు కాల్ చేసి తూప్రాన్ పోలీసులకు సమాచారం అందించారు.వెంటనే స్పందించిన తూప్రాన్ బ్లూకోట్ పోలీస్ విభాగం కానిస్టేబుల్లు ఎమ్. రవి,ఎమ్.మహేష్ ఘటనా స్థలానికి చేరుకుని వృద్ధురాలిని కాపాడి తూప్రాన్ పోలీస్ స్టేషన్ కు తరలించారు.అనంతరం బాలమణి కుమారుడు గజేంద్రుల శంకర్ ను పోలీస్ స్టేషన్ కు పిలిపించి ఎస్సై 2 యాదగిరి,మహిళా ఎస్సై జ్యోతి కౌన్సిలింగ్ ఇచ్చి దంతాన్ పల్లి సర్పంచ్ గజేంద్రుల నర్సింలు సమక్షంలో వృద్ధురాలు బాలమణిని క్షేమంగా పంపించారు.

## నేడు శివంపేటలో తై బజార్ వేలం...




**శివంపేట,- మార్చి 29 (మహాప్రభ)**
మండల కేంద్రమైన శివంపేట గ్రామపంచాయతీకి సంబంధించిన తైబజార్ టెండర్ వేలం సోమవారం నిర్వహించడం జరుగుతుందని గ్రామపంచాయతీ కార్యదర్శి రమాదేవి తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం ఉదయం 11 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో 2026 -27 సంవత్సరానికి సంబంధించిన తై బజార్ టెండర్ వేలం ను స్థానిక శివంపేట గ్రామ సర్పంచ్ రాజి పేట వెంకటేశ్వర్ ముదిరాజ్,ఉప సర్పంచ్ ఇసు గారి మల్లేశం గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు, గ్రామస్తుల సమక్షంలో బహిరంగ వేలం ఉంటుందని తెలిపారు. ఈ వేళములో పాల్గొనే ప్రతి ఒక్కరూ 25 వేల రూపాయలు సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి ఉంటుందని వేళములో ఎవరి పాట ఎక్కువ ఉంటే వారికే ఇవ్వడం జరుగుతుందని గ్రామ కార్యదర్శి రమాదేవి తెలిపారు.ఇట్టి కార్యక్రమాన్ని గ్రామస్తులు విజయవంతం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ ను స్వాధీనం చేసుకున్న పోలీసులు.

-అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం
-తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్




**తూప్రాన్ - మార్చి 29 (మహాప్రభ)**
మెదక్ జిల్లా వెల్దుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి సమయంలో పంతులపల్లి,బస్వాపూర్ గ్రామ శివారులో అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఒక ట్రాక్టర్ను వెల్దుర్తి పోలీసులు గుర్తించి అడ్డుకున్నారు.అనంతరం ఆ ట్రాక్టర్ను స్వాధీనం చేసుకుని ఎల్దుర్తి పోలీస్ స్టేషన్కు తరలించారు.ఈ ఘటనపై సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు కొనసాగిస్తున్నామని తూప్రాన్ డిఎస్ పి నరేందర్ గౌడ్ మీడియాకు తెలిపారు.ఈ సందర్భంగా డిఎస్పి నరేందర్ గౌడ్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఇసుకను తవ్వడం,తరలించడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలగడంతో పాటు పర్యావరణానికి కూడా హాని కలుగుతోందన్నారు.ఈ నేపథ్యంలో అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి,రాత్రి పూట గస్తీ మరియు వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు.అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకొని,సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.అనుమతులు లేకుండా ఇసుక తవ్వకం లేదా రవాణా చేసే వారు కఠిన చట్టపరమైన చర్యలకు గురవుతారని డీఎస్పీ మీడియాకు తెలిపారు.

## వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నిక

**మానకొండూరు, మార్చి 29(మహాప్రభ)**
మానకొండూరు మండలంలో వ్యవసాయ కార్మిక సంఘం మహాసభ నిర్వహించి నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉపాధ్యక్షుడు రాయకండి శ్రీనివాస్ హాజరై మండల కమిటీని ప్రకటించారు.నూతన కమిటీలో అధ్యక్షురాలిగా గాజర్ల వీరమ్మ, కార్యదర్శిగా ఏడెల్లి స్వామి, ఉపాధ్యక్షురాలిగా పోతర్ల సుజాత, సహాయ కార్యదర్శిగా ఆరెల్లి వజ్రమ్మను ఎన్నుకున్నారు. 15 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసి బాధ్యతలు అప్పగించారు.

# అమ్మకు అక్షరమాల ఉల్లాస్ కార్యక్రమం


**కామారెడ్డి జిల్లా - మార్చి 29 (మహాప్రభ)**
"అమ్మకు అక్షరమాల ఉల్లాస్" కార్యక్రమంలో భాగంగా ఈరోజు Kamareddy జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన NIOS/FLNAT పరీక్షలు విజయవంతంగా పూర్తయ్యాయి. ఈ పరీక్షలకు మొత్తం 16,331 మంది అభ్యాసకులు నమోదు చేసుకోగా, వారిలో గణనీయమైన సంఖ్యలో అభ్యాసకులు హాజరై పరీక్షలు రాశారు.
పరీక్షల నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా 526 మంది DRDA-SERP సిబ్బందిని ఇన్విజిలేటర్లుగా నియమించారు. పరీక్షా కేంద్రాలలో నియమ నిబంధనలు కచ్చితంగా పాటించేలా చర్యలు




తీసుకోవడంతో పాటు, అభ్యాసకులకు అనుకూలమైన వాతావరణం కల్పించారు. ఈ పరీక్షలను జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, అదనపు ప్రాజెక్ట్ అధికారి విజయ లక్ష్మి, డీపీఎంలు, జిల్లా వయోజన విద్యా ప్రాజెక్ట్ అధికారి, జిల్లాలోని ఏపీఎంలు, ఎంఈఓలు మరియు ఐ=ణా - SERP సిబ్బంది పర్యవేక్షించారు. వారు పలు పరీక్షా కేంద్రాలను సందర్శించి నిర్వహణను సమీక్షించారు. అధికారులు పరీక్షల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, సిబ్బంది కృషిని అభినందించారు. వయోజనులలో అక్షరాస్యత పెంపొందించడంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.

# రామాయంపేట నియోజకవర్గ పునరుద్ధించాలి

**రామయంపేట మార్చి 29 మహాప్రభ**
రామయంపేట పట్టణాన్ని పునరుద్దించాలని కోరుతూ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మరియు నిజాంపేట మండలం కార్యకర్తలు నాయకుల సమక్షంలో భారీ ఎత్తున రామయంపేట క్యాంప్ ఆఫీస్ నుండి రాజుల బయలుదేరి రామయంపేట నియోజకవర్గాన్ని ఏర్పాటు చేయాలని రామాయంపేట ఎమ్మార్వో గారికి అందజేస్తారని దీనికి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో . నేతి పత్రాన్ని అందజేయనున్నారు. రామాయంపేట ఇప్పటికే చాలా వెనుకబడి ఉన్నందున నియోజకవర్గం కోల్పోయిన ప్రాంతం కావడం వలన ఇప్పుడు జరిగే నియోజకవర్గం పునర్విభజన సందర్భంగా రామాయంపేటకు ఒక మంచి అవకాశం రావడం వల్ల ఈ యొక్క ప్రాంతాన్ని మరియు. అధికార పార్టీ ప్రతినిధులు యుద్ధం చేసుకొని మళ్లీ కోరుతున్నారు కోరుతున్నారునియోజకవర్గాన్ని తీసుకురావాలని రామాయంపేట మరియు నిజాంపేట మండల నాయకులు కోరుతున్నారు దీనికి . అలాగే రామాయంపేట గత చరిత్ర చూసుకున్నట్లయితే రామాయంపేట 1952 రావడం జరిగింది. తదుపరి 2009 వరకు సుమారుగా 14 మంది రామపేట నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేల గెలుపొందడం జరిగింది. కానీ ఈ ప్రాంతం అభివృద్ధికి


నోచుకోనందున గుర్తింపు లేక నియోజకవర్గం కోల్పోవడం జరిగినది 1983లో టి అంజయ్య గారు గెలుపొంది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు ముఖ్యమంత్రిగా పరిపాలన సాధించడం జరిగింది కావున ఇప్పటికైనా రామాయంపేట ను గుర్తించి నియోజకవర్గాన్ని కోల్పోయిన రామాయంపేటలో తిరిగి నియోజకవర్గంలో రామాయంపేట నిజాంపేట ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు నాయకులు పెద్ద ఎత్తున ర్యాలీగా బయలుదేరి ఎమ్మార్వో కి పత్రం అందజేయనున్నారు. గతంలో రామాయంపేట నుండి సీఎంగా గెలిచిన టంగుటూరి అంజయ్య గారు అప్పటినుంచి కార్యకర్తలు సీనియర్ నాయకులు అబ్రమైన గంగరాములు అదే పార్టీలో ఉంటూ ఇప్పటివరకు ఆ పార్టీ యొక్క కార్యక్రమాలు అన్నిటికీ అభివృద్ధికి ముందు నిలబడి ఎన్నో కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్నారు కనుక గతంలో ఆయనకు పదవులు లేకున్నా రామాయంపేటకు హిందూ సేవా కార్యక్రమాలు అందించారు నియోజకవర్గ చేయాలని రామాయంపేట సీనియర్ నాయకుడు అబ్రమైన గంగారం డిమాండ్ చేశారు దీనికి రామాయంపేట గ్రామ ప్రజలు నిజాంపేట గ్రామ ప్రజలు అందరు సహకరించగలరని ఆయన కోరారు

# అత్తను హతమార్చిన కోడలు..

**-24 గంటల్లోనే కేసు ఛేదించిన గాంధారి పోలీసులు**
**- అభినందించిన జిల్లా ఎస్పీ**

**కామారెడ్డి, మార్చి 29(మహాప్రభ)**
జిల్లాలో సంచలనం సృష్టించిన వృద్ధురాలి హత్య కేసును గాంధారి పోలీసులు కేవలం 24 గంటల్లోనే ఛేదించారు. అత్తను కిరాతకంగా హతమార్చి, ఏమీ తెలియనట్టుగా నాటకం ఆడిన కోడలిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన సీతాయిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపేట్ మండలం భవానిపేట్ గ్రామానికి చెందిన సజ్జనపల్లి శాంతవ్వ తన తల్లి రుక్మవ్వ (73) అనుమానాస్పద మృతిపై గాంధారి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఉదయం సమాచారం అందుకున్న ఆమె సీతాయిపల్లికి వెళ్లి పరిశీలించగా, తల వద్ద రక్తస్రావం ఉండటం, బంగారు ఆభరణాలు కనిపించకపోవడం గమనించింది. మొదట కోడలు కోటవ్వ "పడిపోవడంతో గాయం అయింది" అని చెప్పినా, తరువాత మృతదేహాన్ని శుభ్రం చేసే సమయంలో తలకు బలమైన గాయం ఉన్నట్లు బయటపడింది.ఈ నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. జిల్లా ఎస్పీ





ఆదేశాలతో యెల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్‌రావు పర్యవేక్షణలో సదాశివనగర్ సీఐ బి. సంతోష్ కుమార్, ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి విచారణ చేపట్టారు. అనుమానం మేరకు కోడలు కావటి కోటవ్వను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది.డబ్బులు ఇవ్వలేదనే కక్షతో కోటవ్వ, తెల్లవారుజామున ఇంట్లో నిద్రిస్తున్న అత్త రుక్మవ్వపై రాయితో దాడి చేసి హతమార్చినట్లు అంగీకరించింది. అనంతరం ఘటనను దాచిపెట్టేందుకు రక్తపు ఆనవాళ్లు తుడిచేసి, సుమారు 1.5 తులాల బంగారు గుండ్లు, చెవి కమ్మలు దొంగిలించినట్లు వెల్లడైంది. పోలీసులు నిందితురాలి వద్ద నుంచి 13.8 గ్రాముల బంగారు గుండ్లు, 1.2 గ్రాముల చెవి కమ్మ స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.ఈ కేసును వేగంగా ఛేదించిన సీఐ బి. సంతోష్ కుమార్, ఎస్ఐ ఆంజనేయులు, సిబ్బంది రవికుమార్, సాందీప్, జానకిరామ్‌లను జిల్లా ఎస్పీ అభినందించారు.

# రామాయంపేటలో ద్విచక్ర వాహనాలు డి





**రామయంపేట మార్చి 29 మహాప్రభ**
రామాయంపేటలో టీ పాయింట్ ముందర ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి వారికి తీవ్రంగా నలుగురికి గాయాలయ్యాయి .వారిని వెంటనే స్థానిక గవర్నమెంట్ హాస్పిటల్ లో చికిత్స చేయించి. రామాయంపేట కు చెందిన వ్యక్తిని హైదరాబాద్కు తరలించారు



# బిజినెస్

## ఏప్రిల్ 1 నుండి దేశవ్యాప్తంగా కీలక మార్పులు

**అమరావతి**




కొత్త ఆర్థిక సంవత్సరం 2026-27 ప్రారంభం కానున్న నేపథ్యంలో .... ఏప్రిల్ 1 నుండి దేశవ్యాప్తంగా పలు కీలక మార్పులు అమల్లోకి రానున్నాయి. పన్ను విధానం నుండి బ్యాంకింగ్ వరకు సామాన్యుడి దైనందిన జీవితంపై ప్రభావం చూపబోయే అంశాలేవిటంటే ....1961 నాటి చట్టం స్థానంలో 'కొత్త ఆదాయపు పన్ను చట్టం-2025' అమల్లోకి వస్తుంది. దీని ప్రకారం పన్ను చెల్లింపుదారులకు గందరగోళంగా ఉన్న 'అసెస్మెంట్ ఇయర్ ', 'ప్రీవియస్ ఇయర్ ' వంటి పదాల స్థానంలో సులభంగా అర్థమయ్యేలా 'పన్ను సంవత్సరం అనే పదాన్ని ఉపయోగించనున్నారు. కొత్త పన్ను విధానంలో సెక్షన్ 87ఏ కింద రిబేట్ పెంచడంతో, రూ.12 లక్షల వరకు వార్షిక ఆదాయం ఉన్నవారికి పన్ను మినహాయింపు లభించనుంది. ఫారం-16 స్థానంలో కొత్తగా ఫారం-130, 131 లు రానున్నాయి. పాన్ కార్డు కోసం పుట్టిన తేదీ రుజువుగా ఆధార్‌ను అంగీకరించరు. కేవలం 10వ తరగతి సర్టిఫికేట్ లేదా పాస్‌పోర్ట్ మాత్రమే అవసరం. భారతీయ రైల్వే కూడా ప్రయాణికులకు అనుకూలంగా రైలు టికెట్ రద్దు నిబంధనలను రైల్వే శాఖ సవరించింది. పూర్తి రిఫండ్ పొందాలంటే రైలు బయలుదేరడానికి 8 గంటల ముందే టికెట్ రద్దు చేసుకోవాలి . 8 నుండి 24 గంటల మధ్య రద్దు చేస్తే 50 శాతం రిఫండ్ లభిస్తుంది. అలాగే, కొన్ని ప్రధాన బ్యాంకులు తమ ఏటీఎం, డెబిట్ కార్డు నిబంధనలను మార్చాయి. హెచ్‌డిఎఫ్‌సి బంధన్ బ్యాంకులు ఉచిత ఏటీఎం లావాదేవీల పరిమితి దాటితే ప్రతి ట్రాన్సాక్షన్‌కు రూ. 23 వసూలు చేయనున్నాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్ తన డెబిట్ కార్డుల రోజువారీ విత్‌డ్రాయల్ పరిమితిని రూ. 75,000 నుండి రూ. 50,000కి తగ్గించింది. అంతర్జాతీయ ఉద్రిక్తతల వల్ల ఎల్‌పీజీ, సీఎన్‌జీ, విమాన ఇంధన ధరలు పెరిగే అవకాశం ఉంది. ఇది రవాణా ఖర్చులపై నేరుగా ప్రభావం చూపనుంది.

## బంగారం, వెండి ధరలకు బ్రేకులు.

**- హైదరాబాద్‌లో తులం ధర ఎంతంటే..**

బంగారం, వెండి ధరల్లో ఎలాంటి మార్పులు లేవు. స్థిరంగా కొనసాగుతున్నాయి. కానీ గత రెండు రోజులుగా బంగారం, వెండి ధరలు భారీగానే పెరుగుతున్నాయి. గతంలో రికార్డు స్థాయిలో పెరిగిన ధరలు.. గత కొన్ని రోజులుగా అంతే రికార్డు స్థాయిలో దిగి వస్తున్నాయి. తాజాగా మార్చి 29వ తేదీన బంగారం, వెండి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. మరి ఈ రోజు ప్రధాన నగరాల్లో ధరలను తెలుసుకుందాం..

హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,090 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,35,750 వద్ద కొనసాగుతోంది.

విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,090 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,35,750 వద్ద కొనసాగుతోంది.



ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,220 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,35,750 వద్ద కొనసాగుతోంది.

ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,090 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,35,750 వద్ద కొనసాగుతోంది.

చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,49,020 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,36,600 వద్ద కొనసాగుతోంది.

బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,090 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,35,750 వద్ద కొనసాగుతోంది.

కేరళలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,090 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,35,750 వద్ద కొనసాగుతోంది.

ఇక వెండి విషయానికొస్తే.. ధర స్థిరంగా కొనసాగుతోంది. కిలో వెండి ధర హైదరాబాద్, చెన్నై, కేరళలలో రూ.2,50,000 ఉండగా, ఇతర నగరాల్లో 2,45,000 రూపాయల వద్ద ట్రేడవుతోంది.

## పీఎం ఈ-డ్రైవ్ స్కీమ్‌లో సవరణలు

**ఈవీ ప్రోత్సాహకాలపై పరిమితులు**

**న్యూఢిల్లీ:**

ప్రధాన మంత్రి ఎలక్ట్రిక్ డ్రైవ్ రెవల్యూషన్ ఇన్ ఇన్నోవేటివ్ వెహికిల్ ఎన్‌హాన్స్‌మెంట్ (పీఎం ఈ-డ్రైవ్) పథకాన్ని కేంద్ర ప్రభుత్వం సవరించింది. కొత్త అర్హత గడువును నిర్దేశించడంతో పాటు విద్యుత్ ద్విచక్ర, త్రిచక్ర వాహనాలకు అందించే సబ్సిడీపైనా పరిమితులు విధించింది. 2026 జూలై 31 వరకు రిజిస్టర్ చేసుకునే ఎలక్ట్రిక్ టూవీలర్లు, 2028 మార్చి 31 వరకు రిజిస్టర్ చేసుకునే ఎలక్ట్రిక్ త్రీవీలర్లకు మాత్ర మే ఈ పథకం కింద



ప్రోత్సాహకాలు లభించనున్నా యి. అంతేకాదు, రూ.1.5 లక్షల వరకు (ఎక్స్-ఫ్యాక్టరీ) ధర కలిగిన ఎలక్ట్రిక్ టూవీలర్లు, రూ.2.5 లక్షల వరకు విలువైన ఎలక్ట్రిక్ త్రీవీలర్లకు మాత్రమే ఈ పథకం ద్వారా సబ్సిడీ లభించనుంది. 2028 మార్చి 31 గడువుతో కూడిన ఈ పథకం ద్వారా సబ్సిడీ చెల్లింపులకు కేంద్రం రూ.10,900 కోట్లు కేటాయించింది. నిధులను మరింత పెంచే అవకాశం లేదని స్పష్టం చేసింది. అంటే, గడువుతో సంబంధం లేకుండా సబ్సిడీ చెల్లింపుల మొత్తం రూ.10,900 కోట్లకు చేరుకోగానే పథకం పూర్తవుతుంది.

## వారిపై రెండేళ్ల నిషేధం సరిపోదు.. మరిన్ని కఠిన చర్యలు తీసుకోవాల్సిందే.!

ఐపీఎల్ ఆరంభానికి ముందు కొందరు విదేశీ ఆటగాళ్లు ప్లేట్ ఫిరాయించడం పరిపాటి అయింది. నిరుడు హ్యారీ బ్రూక్, ఇప్పుడేమే బెన్ డకెట్.. ఇద్దరూ ఇంగ్లండ్ ఆటగాళ్లు ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఆఖరి నిమిషంలో హ్యాండిచ్చారు. జట్టు కూర్పు దాదాపు ఖరారైన సమయంలో క్రికెటర్లు 'మేము వైదొలుగుతన్నాం' అని చెప్పడాన్ని ఇక ఏమాత్రం తేలికగా తీసుకోవవద్దని మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ అంటున్నాడు. ఆఖరి నిమిషంలో ఏదో సాకు చూపి మేము ఆడలేము అంటూ కూల్‌గా హ్యాండిచ్చే విదేశీ క్రికెటర్లపై రెండేళ్ల నిషేధం సరిపోదని, మరిన్ని కఠిన చర్యలు తీసుకోవాలని సన్నీ డిమాండ్ చేస్తున్నాడు.ఐపీఎల్ సీజన్ ప్రారంభానికి ముందు ఏదో కారణంతో వైదొలిగే ఆటగాళ్లకు తగిన బుద్ధి చెప్పాలని గవాస్కర్ అభిప్రాయ పడుతున్నాడు. ప్రస్తుతం అమలులో ఉన్న శిక్ష వ్యవస్థను సమీక్షించాలని బీసీసీఐకి అతడు సూచించాడు. ఐపీఎల్ వేలంలో అమ్ముడైన ఆటగాళ్లు ఆఖరి నిమిషంలో వైదొలిగితే వారిపై రెండేళ్ల నిషేధం విధించడంతో పాటు కఠిన చర్యలు



తీసుకోవాలని గవాస్కర్ డిమాండ్ చేశాడు. మరొకరు ఇలాంటి పొరపాటు చేయకుండా చూసేందుకు గట్టి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపాడు.యాషెస్ సిరీస్‌లో బెన్ డకెట్ బాగా ఆడాడు. ది హండ్రెడ్ వేలంలో అతడికి ఆశించినంత ధర దక్కలేదంటే పరిస్థితి వేరేలా ఉండేది. కానీ, అతడిక మంచి ధర వచ్చింది. అప్పుడు అతడు దేశం తరఫున ఆడడంపై దృష్టి సారించాలని ఫ్రాంచైజీకి చెప్పి ఉండాల్సింది. కానీ, మనోడు అలా చేయలేదు. ఇప్పుడు ఐపీఎల్ ఆడేందుకు దేశం కోసం ఆడాలని ఉందనే సాకు చూపించాడు. కాబట్టి.. ప్రస్తుతం అములో ఉన్న రెండేళ్ల నిషేధం పెద్దగా ఫలితమివ్వడం లేదు. అందుకని ఆటగాళ్లపై ప్రభావం పడేలా కఠిన చర్యలు తీసుకోవాలి. లేదంటే వారు రెండేళ్ల తర్వాత ఐపీఎల్ ఆడుతూనే ఉంటారు' అని గవాస్కర్ పేర్కొన్నాడు.

## చెన్నై ఫ్యాన్స్‌కు షాకింగ్ న్యూస్..

**గాయపడిన మరో డేంజరస్ ప్లేయర్..!**

ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభం కాకముందు నుంచే చెన్నై సూపర్ కింగ్స్ జట్టు ఇబ్బందులను ఎదుర్కొంటోంది. మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ రాబోయే కొన్ని వారాల పాటు ఆటకు దూరంగా ఉండనున్నాడు. ఇప్పుడు, ఆ జట్టు అత్యంత విధ్వంసకర బ్యాట్స్‌మెన్ గాయపడటంతో ఆ జట్టుకు మరో పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. నివేదికల ప్రకారం, 22 ఏళ్ల దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్ డెవాల్డ్ బ్రెవిస్ కూడా ఫిట్‌నెస్ సమస్యలతో బాధపడుతున్నాడు. తొలి మూడు మ్యాచ్‌లకు దూరమవుతాడు.

**అకస్మాత్తుగా బ్రెవిస్‌కు ఏమైంది?**

విధ్వంసకర మిడిల్-ఆర్డర్ బ్యాట్స్‌మెన్ డెవాల్డ్



బ్రెవిస్ పక్కటెముకల నొప్పితో బాధపడుతున్నాడని, సీజన్‌లోని మొదటి మ్యాచ్‌కు దూరమవుతాడని ఒక నివేదిక వెల్లడించింది. మార్చి 30, ఆదివారం నాడు రాజస్థాన్ రాయల్స్‌తో జరిగే తమ మొదటి మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తలపడనుంది. ఈ మ్యాచ్‌లో ధోనీ, బ్రెవిస్ ఇద్దరూ లేకుండానే చెన్నై జట్టు ఆడాల్సి ఉంటుంది. అయితే ఆందోళన కేవలం ఈ మ్యాచ్ గురించే కాదు.. అతను తర్వాతి మ్యాచ్‌కు కూడా దూరమయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. గత సీజన్‌లో జట్టు తరఫున అత్యంత విజయవంతమైన బ్యాట్స్‌మెన్‌లలో ఒకడిగా నిలిచిన బ్రెవిస్ గాయం చెన్నై సమస్యలను మరింత తీవ్రం చేసింది. సీజన్ మధ్యలో ప్రత్యామ్నాయ ఆటగాడిగా జట్టులోకి వచ్చిన అతను, కేవలం ఆరు మ్యాచ్‌లలోనే 17 సిక్సర్లు, 13 ఫోర్లతో 225 పరుగులు సాధించాడు. అతని 180 స్ట్రైక్ రేట్ కొన్ని మ్యాచ్‌లలో చెన్నై బలంగా రాణించడానికి సహాయపడింది. ఇప్పుడు, చెన్నై జట్టు అతను లేకుండానే బరిలోకి దిగాల్సి ఉంటుంది. అలాగే ధోనీ కూడా తుది జట్టులో ఉండడు.

# స్పోర్ట్స్

## బిగ్‌బాస్ బ్యూటీతో సిరాజ్ ప్రేమాయణం..



భారత ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ సిరాజ్ మరోసారి వార్తల్లో నిలిచాడు. ఈసారి ఆట తీరుతో కాకుండా తన వ్యక్తిగత జీవితం వల్ల ఆయన చర్చనీయాంశమవ్వడం గమనార్హం. తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఒక వీడియోలో సిరాజ్, నటి మహీరా శర్మ ముంబైలోని ఒకే రెస్టారెంట్ వద్ద కనిపించారు. అయితే, వీరిద్దరూ ఒకే ఫ్రేమ్‌లో పక్కపక్కన కనిపించలేదు. సిరాజ్ బయట అభిమానులతో మాట్లాడుతుండగా, మహీరా అదే సమయానికి రెస్టారెంట్ నుంచి బయటకు వచ్చి తన కారు వైపు వెళ్లడం ఆ వీడియోలో కనిపిస్తోంది. ఈ దృశ్యాలు చూసిన నెటిజన్లు వీరిద్దరి మధ్య ఏదో నడుస్తోందంటూ సోషల్ మీడియాలో కామెంట్లు పెడుతున్నారు.

**గతంలోనూ ఇదే తరహా ప్రచారం..**

సిరాజ్, మహీరా శర్మల మధ్య సంబంధం ఉందనే వార్తలు రావడం ఇదే మొదటిసారి కాదు. గత ఏడాది కూడా వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. సోషల్ మీడియాలో ఒకరి పోస్టులను మరొకరు లైక్ చేయడం, ఫాలో అవ్వడం వంటివి అభిమానుల దృష్టిని ఆకర్షించాయి. అప్పట్లో ఈ వార్తలపై మహీరా శర్మ స్పందిస్తూ.. తాను ఎవరితోనూ డేటింగ్‌లో లేనని, పుకార్లను నమ్మవద్దని స్పష్టం చేసింది.డేటింగ్ వార్తలు శృతిమించుతున్న తరుణంలో మహమ్మద్ సిరాజ్ కూడా గతంలో ఇన్స్టాగ్రామ్ వేదికగా స్పందించాడు. తనపై వస్తున్న వార్తలు పూర్తిగా నిరాధారమైనవని, అవి వాస్తవం కాదని ఆయన ఒక స్టోరీ పెట్టారు. అయితే, ఆశ్చర్యకరంగా ఆ పోస్టును పెట్టిన కొద్దిసేపటికే ఆయన తొలగించడం గమనార్హం. దీంతో అభిమానుల్లో అనుమానాలు మరింత పెరిగాయి.




# నాగార్జున జోడీగా?

'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంతో తెలుగులో తొలిసారి బ్లాక్‌బస్టర్ సక్సెస్‌ను సాధించింది ఐశ్వర్యరాజేష్. ఈ సినిమా తర్వాత తెలుగులో ఈ భామకు అవకాశాలు బాగా వస్తాయనుకున్నారు. అయితే సినిమాల ఎంపికలో సెలెక్టివ్‌గా ఉండటం, తమిళంలో వరుస కమిట్‌మెంట్స్ వల్ల ఏడాదికాలంగా టాలీవుడ్‌కు దూరంగా ఉంటున్నది ఐశ్వర్యరాజేష్. తాజా సమాచారం ప్రకారం ఈ తెలుగందం తెలుగులో మరో బంపరాఫర్‌ను దక్కించుకున్నట్లు తెలిసింది. నాగార్జున వందో చిత్రంలో ఐశ్వర్యరాజేష్ కథానాయికగా ఖరారైందని ఫిల్మ్‌నగర్ టాక్. 'కింగ్100' అనే టైటిల్‌తో రూపొందుతున్న ఈ సినిమా శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. రా.కార్తీక్ దర్శకత్వంలో యాక్షన్ కలబోసిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్నది. ఈ సినిమాలో కథానాయిక కోసం కొన్ని నెలలుగా అన్వేషణ జరుగుతున్నది. చివరగా చిత్రబృందం ఐశర్వరాజేష్ వైపు మొగ్గుచూపిందని చెబుతున్నారు. ఈ సినిమాలో సీనియర్ కథానాయిక టబు కీలక పాత్రలో కనిపించనుంది. త్వరలో 'కింగ్100' షూట్‌లో ఐశ్వర్యరాజేష్ జాయిన్ అవుతారని వార్తలొస్తున్నాయి. అయితే ఈ విషయంలో చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.




## త్రిణాధరావు నక్కిన
# మార్క్ స్టోరీతో 'అనకాపల్లి'..
### ఆకట్టుకుంటున్న టీజర్

యంగ్ అండ్ టాలెంటెడ్ నటుడు, నా పేరు సూర్య.. నా ఇల్లు ఇండియా ఫేమ్ విక్రమ్ సాహిదేవ్, సంధ్యా వశిష్ట, తారక్ పొన్నప్ప ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'అనకాపల్లి'. ఈ చిత్రం సమ్మర్ కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా తాజాగా టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. టీజర్ చూస్తుంటే.. ఈ సినిమా ఒక ఇంటెన్స్ పల్లెటూరి యాక్షన్ డ్రామాగా తెరకెక్కినట్లు అర్థమవుతోంది. ఇందులో విక్రమ్ సాహిదేవ్ తన సరికొత్త లుక్ మరియు పవర్‌ఫుల్ యాక్టింగ్‌తో ఎంతగానో ఆకట్టుకున్నాడు. విక్రమ్‌తో పాటు సంధ్యా వశిష్ట, తారక్ పొన్నప్ప కీలక పాత్రల్లో నటించి సినిమాపై అంచనాలను భారీగా పెంచేశారు.ఈ సినిమా వెనుక టాలీవుడ్‌లో వరుస హిట్‌లతో దూసుకుపోతున్న ప్రముఖ దర్శకుడు త్రినాథరావు నక్కిన ఉండటం విశేషం. ఈ చిత్రానికి ఆయనే స్వయంగా కథ, స్క్రీన్‌ప్లే అందించగా, ఖగేష్ తమ్మినేని దర్శకత్వం వహించారు. నక్కిన నరేటివ్స్ మరియు భవ్య శ్రీ మూవీ మేకర్స్ బ్యానర్లపై త్రినాథరావు నక్కిన, నాయుడు కాండ్రేగుల సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. దీనికి డావ్‌జాండ్ అద్భుతమైన సంగీతాన్ని అందించారు. టీజర్ చివర్లో మేకర్స్ ప్రకటించినట్లుగా ఈ మూవీని 'సమ్మర్ 2026' కానుకగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. టీజర్ చూసిన సినీ ప్రియులు ఈ సమ్మర్‌లో ఒక సాలిడ్ మాస్ ఎంటర్టైనర్ పడబోతోందని సోషల్ మీడియాలో కామెంట్లు పెడుతున్నారు.




# అఖిల్ 'లెనిన్'లో డబుల్ క్లైమాక్స్ ట్విస్ట్ ...
### ఏది ఫైనల్ అవుతుందోనని అందరిలో ఆసక్తి

యువ హీరో అక్కినేని అఖిల్ తన తాజా చిత్రం లెనిన్‌తో కెరీర్‌లో మంచి హిట్ అందుకోవాలని చూస్తున్నారు. దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరి (నందు) తెరకెక్కిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం షూటింగ్ దశలో ఉండగా, సినిమాకు సంబంధించిన ఒక ఆసక్తికరమైన విషయం బయటకు వచ్చింది. ఈ సినిమాలో రెండు వేర్వేరు క్లైమాక్స్‌లను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. మొదటి క్లైమాక్స్ పూర్తిగా మాస్ ఎలిమెంట్స్‌తో నిండిపోయి, హీరోయిజాన్ని ఎలివేట్ చేసే విధంగా ఉంటుందట. అభిమానులకు కావాల్సిన అన్ని కమర్షియల్ అంశాలు ఇందులో ఉంటాయని టాక్ వినిపిస్తోంది.ఇక రెండో క్లైమాక్స్ మాత్రం పూర్తిగా భిన్నంగా ఉండనుందని తెలుస్తోంది. కథలో ఊహించని ట్విస్ట్‌తో పాటు హీరో పాత్రలో గ్రే షేడ్ కనిపించేలా డిజైన్ చేశారట. ముఖ్యంగా హీరో తీసుకునే నిర్ణయం ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేస్తుందని, అదే సమయంలో ఈ ముగింపులో సీక్వెల్‌కు హింట్ కూడా ఉంటుందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఈ రెండు క్లైమాక్స్‌లలో చివరకు దేనిని ఫైనల్‌గా ఎంపిక చేస్తారో అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. టెస్ట్ స్క్రీనింగ్‌ల తర్వాత లేదా ప్రేక్షకుల అభిరుచిని బట్టి మేకర్స్ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సమాచారం. రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో, ముఖ్యంగా చిత్తూరు ప్రాంతం నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో హీరోయిన్‌గా భాగ్యశ్రీ బోర్సే నటిస్తోంది. అఖిల్-భాగ్యశ్రీ జంట మధ్య వచ్చే లవ్ సీన్స్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని చెబుతున్నారు. ఇక ఈ సినిమాపై అఖిల్ భారీ ఆశలు పెట్టుకున్నాడు. గత చిత్రాల ఫలితాల నేపథ్యంలో ఈ ప్రాజెక్ట్ అతని కెరీర్‌కు కీలకంగా మారింది. సినిమా అవుట్‌పుట్ చాలా బాగా వస్తోందని యూనిట్ నమ్మకంగా చెబుతోంది. డబుల్ క్లైమాక్స్ కాన్సెప్ట్‌తో వస్తున్న 'లెనిన్' సినిమా అఖిల్‌కు బ్రేక్ ఇస్తుందా? లేక మరోసారి నిరాశ పరుస్తుందా? అన్నది తెలియాలంటే రిలీజ్ వరకు వేచి చూడాల్సిందే.



# చాలా హాట్‌గా, బోల్డ్‌గా..
### కాక్‌టెయిల్ 2పై కృతిసనన్ కామెంట్స్ వైరల్

తెలుగు ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని భామ కృతి సనన్ . మహేశ్ బాబు, నాగచైతన్య వంటి లీడింగ్ హీరోలతో నటించిన ఈ బ్యూటీ ప్రస్తుతం హిందీ సినిమాలపైనే ఎక్కువ ఫోకస్ పెట్టింది. కృతి సనన్ ప్రస్తుతం కాక్‌టెయిల్ 2 సినిమాలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. రొమాంటిక్ కామెడీ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం జూన్ 19న గ్రాండ్‌గా విడుదల కానుంది.మోడ్రన్ లవ్, ఫ్రెండ్‌షిప్ నేపథ్యంలో రాబోతున్న ఈ చిత్రంలో తన పాత్ర తన కెరీర్‌లో ఇప్పటివరకు పోషించనివిధంగా చాలా హాటెస్ట్ అండ్ బోల్డ్‌గా సాగుతుందని చెబుతోంది కృతిసనన్. అంతేకాదు తన రోల్ ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేయడం ఖాయమంటోంది. ఈ మూవీలో రష్మిక మందన్నా, షాహిద్ కపూర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇందులో రష్మిక మందన్నా, కృతిసనన్ పార్ట్‌నర్స్‌గా కనిపించబోతుండగా.. ఈ కాంబో కథనాన్ని ఆసక్తికరంగా సాగేలా చేస్తుందట. తాజా టాక్ ప్రకారం ఈ ఇద్దరు ఫీ మేల్ స్టార్ల మధ్య వచ్చే సన్నివేశాలు చాలా బోల్డ్‌గా ఉండబోతున్నాయి. ఇదే నిజమైతే సిల్వర్ స్క్రీన్‌పై మరో ప్రయోగాత్మక సినిమాతో ప్రేక్షకులను థ్రిల్ అందించడం పక్కా అయిపోయినట్టే. హోమి అడంజనియా డైరెక్ట్ చేస్తున్న కాక్‌టెయిల్ 2 థీమ్, ప్రజెంటేషన్ చాలా బోల్డ్‌గా ఉండబోతుందని బీటౌన్ సర్కిల్ సమాచారం. డేరింగ్ స్టోరీ లైన్, స్టన్నింగ్ కాంబోలో వస్తున్న రాబోతున్న ఈ చిత్రంపై ఇప్పటికే అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి.

# 'ఫౌజీ' విడుదల అప్పుడేనా?



అగ్ర కథానాయకుడు ప్రభాస్ నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రాల్లో 'ఫౌజీ' ఒకటి. హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాలో నూతన నటి ఇమాన్వీ కథానాయిక. 400కోట్ల భారీ బడ్జెట్‌తో మైత్రీ మూవీమేకర్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్ ఆర్‌ఎఫ్‌సీలో శరవేగంగా జరుగుతున్నది. ప్రభాస్ లేని సన్నివేశాలను దర్శకుడు హను రాఘవపూడి చిత్రీకరిస్తున్నారు. ఇప్పటికే 70శాతం ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేసుకున్నది. ఇందులో ప్రభాస్ బ్రిటీష్ సైనికుడిగా నటిస్తున్న విషయం తెలిసిందే. బ్రిటీష్ కాలపు కథతో సాగే ఈ పీరియడ్ డ్రామాలో అద్భుతమైన ప్రేమకథ కూడా ఉంటుందనేది ఇన్‌సైడ్ టాక్. స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా ఆగస్ట్ 14న కానీ, లేక దసరాకు గానీ పానిండియా స్థాయిలో తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ, బెంగాలీ భాషల్లో ఈ సినిమాను విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. మిథున్ చక్రవర్తి, అనుపమ్‌ఖేర్, జయప్రద, భానుచందర్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్ శేఖర్, నిర్మాతలు: నవీన్ యర్నేని, వై.రవిశంకర్ది

# పౌరాణిక దృశ్యకావ్యంగా 'మహాకాళి'




హను-మాన్'ఫేం ప్రశాంత్‌వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వస్తున్న కాల్పినిక పౌరాణిక దృశ్యకావ్యం 'మహాకాళి'. ప్రశాంత్‌వర్మ షోరన్నర్‌గా, పూజా కొల్లూరు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి ఆర్కే దుగ్గల్, రివాజ్ రమేష్ దుగ్గల్ నిర్మాతలు. ఈ చిత్రం వందరోజుల షూటింగ్‌ను విజయవంతంగా పూర్తి చేసుకోగా, చివరి 40 రోజుల షెడ్యూల్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈ సినిమాలో శుక్రాచార్యుడిగా కీలక పాత్రను బాలీవుడ్ వెర్సటైల్ యాక్టర్ అక్షయ్‌ఖన్నా పోషిస్తున్న విషయం తెలిసిందే. రీసెంట్‌గా ఆయన.. తన భాగం చిత్రీకరణంతా పూర్తి చేశారు. మరోవైపు పలు స్టూడియోల్లో ఈ సినిమాకు సంబంధించిన వీఎఫ్ఎక్స్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే సినిమా విడుదల తేదీని ప్రకటించనున్నట్టు నిర్మాతలు శనివారం ప్రకటన విడుదల చేశారు. 'మహాకాళి'గా భూమిశెట్టి టైటిల్‌రోల్ పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సురేష్ రగుతు, సంగీతం: స్మరణ్‌సాయి, నిర్మాణం: RKD స్టూడియోస్

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com